నిర్భయవార్త తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY




సంపుటి : 13 సంచిక : 75 రంగారెడ్డి ఆదివారం 12 జులై 2026 ఎడిటర్ : బవనారి రవికుమార్ 12-07-2026 Sunday పేజీలు : 8 వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy- Siddipet-Medchal-Jagityal-Vemulawada

### పారుతున్న నీళ్లను ఎత్తిపోస్తే..

# బ్యారేజీలు ఎందుకు..?

## కాళేశ్వరంపై బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్



**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:**
కాళేశ్వరంపై బీఆర్ఎస్ నేతలు అవాస్తవాలు చెబుతున్నారని సీఎం రేవంత్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఈ 3 బ్యారేజీల్లో నీరు నింపకూడదని ఎన్డీఎస్ఏ స్పష్టంగా చెప్పిందన్నారు. శనివారం హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ చెబుతున్నట్లు కళ్లముందు నీళ్లు పారుతున్నంత మాత్రాన ఎత్తిపోసే అవకాశం ఉంటే బ్యారేజీలు కట్టే అవసరం ఏముందని ప్రశ్నించారు. బ్యారేజీలు కడ్డటం అంటేనే పారుతున్న నీళ్లను నిలిపి వాటిని ఎత్తిపోయాల్సి ఉంటుందన్నారు. కన్నెపల్లి దగ్గర ఎత్తిపోతలకు అవకాశమే లేదని 93.5 మీటర్ల ఎత్తులో నీరు నిలిపితేనే ఎత్తిపోతల సాధ్యం అవుతుందన్నారు. ఈటల రాజెందర్ అంటే మాకు గౌరవమే కానీ కాళేశ్వరం విషయంలో ఆయన చేసిన (మిగతా 3లో..)

### మార్చి 2027 నాటికి

# భూ రీ-సర్వే పూర్తి..


## కలెక్టర్లకు మంత్రి పొంగులేటి డెడ్‌లైన్



**నిర్భయవార్త ప్రతినిధి : ఖమ్మం:**
తెలంగాణలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్ర వ్యాప్తంగా భూ రీ సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల ఇళ్ల పంపిణీ, విద్యార్థుల యూనిఫాంల పంపిణీ, తదితర అంశాలపై మంత్రి శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లోకేష్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని తెలిపారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.6 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యలను పరిష్కరించినప్పటికీ, అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందన్నారు. తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. (మిగతా 3లో..)

## తెలంగాణలో రైతు డిస్కం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:**



తెలంగాణలో రైతు డిస్కం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు టీజీఆర్‌పీడీసీఎల్ కు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) లైసెన్స్ జారీ చేసింది. దీంతో నాలుగు నెలల్లో దీనికి సంబంధించిన కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. అయితే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ను మాత్రం కొనసాగించనున్నారు. మోటార్లకు మీటర్లు ఉండవని ఈఆర్సీ తేల్చి చెప్పింది. ఇదిలా ఉంటే రాష్ట్రంలో వ్యవసాయ, ఎత్తిపోతల, ప్రభుత్వ నీటి సరఫరా పథకాలకు నిరంతరం విద్యుత్ అందించేందుకు రైతు డిస్కం ఏర్పాటు చేశారు. దీని ఏర్పాటుతో ప్రస్తుతం ఉన్న ఉత్తర, దక్షిణ డిస్కంల నుండి వ్యవసాయ, మిషన్ భగీరథ కనెక్షన్లను తొలగించి రైతు డిస్కంకు బదిలీ చేస్తారు. సచివాలయం వెనుక నిర్మిస్తున్న రెడ్కో భవనంలో ఈ సంస్థ కేంద్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వం తీసుకున్న రైతు డిస్కం నిర్ణయంతో దేశంలోనే వ్యవసాయానికి ప్రత్యేకంగా డిస్కం కలిగిన రాష్ట్రంగా చరిత్ర సృష్టించనుంది.

## రేవంత్ రెడ్డికి శీల పరీక్ష చేయాలి..

### మాజీ మంత్రి కేటీఆర్ సెన్సేషనల్ కామెంట్స్



**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:**
కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలు, రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి సంక్షోభంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ కక్షతో రేవంత్ రెడ్డి తెలంగాణ రైతాంగాన్ని నిలువునా ముంచుతున్నారని మండిపడ్డారు. రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఇచ్చిన నివేదికను చూసి అయినా సీఎం సోయి తెచ్చుకోవాలని డిమాండ్ చేశారు. (మిగతా 3లో..)

## యాదగిరిగుట్టపై సీఎం రేవంత్ ప్లాన్ ఇదే..

### నూతన బోర్డుకు మంత్రి కొండా సురేఖ దిశానిర్దేశం



**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాల మేరకు యాదగిరిగుట్టను దేశంలోనే అత్యుత్తమ ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయయ శాఖ మంత్రి కొండాసురేఖ యాదగిరిగుట్ట నూతన పాలకమండలికి సూచించారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఖ్యాతిని మరింత పెంచే బాధ్యత నూతన పాలక మండలిపై ఉందని దిశానిర్దేశం చేశారు. (మిగతా 3 లో..)

## హైదరాబాద్‌కు ఎమిరేట్స్ 'ఎ-380' విమానాలు..

### సీఎంతో సంస్థ వైస్ ప్రెసిడెంట్ కీలక భేటీ




**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:**
అంతర్జాతీయ విమానయాన రంగంలో హైదరాబాద్ మరో కీలక మైలురాయిని అందుకోబోతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద లగ్జరీ ప్రయాణీకుల విమానమైన 'ఎమిరేట్స్ ఎ-380' సర్వీసులను హైదరాబాద్ నుంచి ప్రారంభించేందుకు ప్రముఖ అంతర్జాతీయ విమానయాన సంస్థ ఎమిరేట్స్ సానుకూలత వ్యక్తం చేసింది. శనివారం ఎమిరేట్స్ విమానయాన సంస్థ (ఇండియా – నేపాల్) వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సర్హాన్.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమిరేట్స్ విమానయాన సంస్థ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారు ముఖ్యమంత్రి భేటీ అయ్యారు.

**వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులపై సీఎం ఫోకస్**
హైదరాబాద్‌లో ఎమిరేట్స్ ఎ-380 సర్వీసులను ప్రారంభించడంతో పాటు సంస్థ విమాన సర్వీసులను మరిన్ని పెంచాలని ముఖ్యమంత్రి వారిని కోరారు. (మిగతా 3 లో..)

# వియత్నాంలో పడవ బోల్తా..

## మృతులకు ప్రధాని మోదీ సంతాపం




**ఢిల్లీ: నిర్భయవార్త ప్రతినిధి :**
వియత్నాంలోని ఫు క్వాక్ ద్వీపం సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగిన ఘోర పడవ ప్రమాదంలో పలువురు భారతీయ పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. మొత్తం 36 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఒక స్పీడ్‌బోట్ సముద్రంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మంది మరణించగా, 21 మంది సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద సమయంలో పడవలో ముగ్గురు సిబ్బందితో పాటు 32 మంది భారతీయ పర్యాటకులు ఉన్నట్లు వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం ధృవీకరించింది. హాన్ మే రట్ ఐలాండ్ నుంచి అన్ థోయ్ పోర్టుకు వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

**ప్రధాని మోడీ తీవ్ర సంతాపం..**
ఈ విషాద ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. 'వియత్నాంలో జరిగిన పడవ ప్రమాదంలో భారతీయులు ప్రాణాలు కోల్పోవడం నన్ను తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు నా సానుభూతి. వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం, కాన్సులేట్ అధికారులు స్థానిక ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. బాధితులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తున్నాం' అని ప్రధాని మోడీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పేర్కొన్నారు. ప్రస్తుతం భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.

## దేశంలో తొలి సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీస్ హబ్ ప్రారంభం

### ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

**నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:**



సెమీకండక్టర్ల తయారీ రంగంలో తెలంగాణ మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో చిప్‌ల తయారీలో అత్యంత కీలకమైన కెమికల్ మెకానికల్ పాలిషింగ్ (సీఎంపీ) ప్యాడ్ టెక్నాలజీకి సంబంధించిన దేశంలోనే తొలి హబ్ హైదరాబాద్‌లో ఏర్పాటైంది. జపాన్‌కు చెందిన తోహో కోకి సీసాకుషో కంపెనీ లిమిటెడ్ సహకారంతో టీ-వర్క్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. (మిగతా 3లో..)

నిర్భయవార్త

సంపాదకీయం

ఆదివారం 12 జులై 2026

# ఆ భూములు రైతులకే

కృత్రిమ మేధ (ఎ.ఐ) కాలంలో, రిటైర్డ్ లోకాయుక్త జస్టిస్ సంతోష్ హెగ్డే చెప్పిన ఒక్క మాట అందరినీ ఆలోచింపజేస్తుంది. 'ఎన్ని ఎ.ఐ లు వచ్చినా, ఆరుగాలం కష్టించే రైతన్న లేకపోతే కడుపు నిండదు'. బెంగళూరు సమీపంలో 'బిడది టౌన్‌షిప్' కోసం రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్న తీరును ఆయన ప్రశ్నించారు. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి పేరుతో భూముల కేటాయింపు, వాటి వినియోగం ఒక సంక్లిష్టమైన సమస్యగా మారిపోయింది. గత, ప్రస్తుత ప్రభుత్వాలు పరిశ్రమలకు కేటాయించిన భూములు కార్పొరేట్ ల్యాండ్ బ్యాంకుగా మారాయే తప్ప పరిశ్రమలు రావడం లేదు. ఈ నేపథ్యంలో, బ్రాహ్మణి స్టీల్స్ భూములు స్వాధీనం చేసుకోవాలన్న ప్రభుత్వం నిర్ణయం సరైనదే అయినప్పటికీ, ఆ భూములను తిరిగి సంబంధిత రైతులకు అప్పగించడం ద్వారానే నిజమైన న్యాయం జరుగుతుంది. అప్పటి పాలకులు బ్రాహ్మణి స్టీల్స్ కు వైఎస్సార్ కడప జిల్లాలోని అంబవరం పరిధిలో 14 వేల ఎకరాల భూమిని ధారాదత్తం చేశారు. 10 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి, వేల మంది యువతకు ఉపాధి అంటూ హడావిడి చేశారు. అయితే, 18 ఏళ్లు గడిచినా అక్కడ నిర్మించింది కేవలం ప్రహరీ గోడ, ఓ చిన్న షెడ్డు మాత్రమే. అంతలోనే ఆ సంస్థ ప్రభుత్వం ఇచ్చిన భూమిని బ్యాంకుల్లో తాకట్టు పెట్టి వందల కోట్ల రుణాలను కొల్లగొట్టింది. ప్రస్తుతం ఈ భూముల విలువ సుమారు రూ. 5 వేల కోట్లు అని అంచనా. ప్రభుత్వ వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి, పారదర్శకతను పెంపొందించడానికి భూముల స్వాధీనం సానుకూల చర్య. అయితే, అభివృద్ధి పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములను సేకరించినప్పుడు, ఆ ప్రాజెక్టులు కార్యరూపం దాల్చకపోతే, వాటిని రైతులకు తిరిగి ఇవ్వడం సరైనది. అలాగే, బ్రాహ్మణి స్టీల్స్ ఒక్కటే కాదు, ఆంధ్రప్రదేశ్‌లో గత, ప్రస్తుత ప్రభుత్వాలు పరిశ్రమలకు కేటాయించినప్పటికీ నిరుపయోగంగా ఉన్న భూములు వేలాది ఎకరాల్లో ఉన్నాయి. పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన కోసం ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఎ.పి.ఐ.ఐ.సి) ద్వారా లక్షల ఏకరాల భూములను కేటాయించారు. అయితే, ఈ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడం వల్ల అవి నిరుపయోగమయ్యాయి. దీంతో ప్రభుత్వం ఆదాయం కోల్పోవడంతో పాటు, ఆ భూముల విలువ పెరిగినా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతుంది. ఉపాధి అవకాశాలు ఆశించిన యువతకు నిరాశే మిగిలింది. వ్యవసాయ భూములను కోల్పోయిన రైతులకు, పారిశ్రామికాభివృద్ధి లేకపోవడంతో అటు భూమి, ఇటు ఉపాధి లేకుండా పోయింది. అయితే ఇటీవలే పరిశ్రమల మంత్రి గత 15 నెలల్లో 10 వేల ఎకరాలకు పైగా భూమిని పరిశ్రమలకు కేటాయించామని, గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 8 వేల ఎకరాలు మాత్రమే కేటాయించిందని తమ ఘనతను చెప్పుకొచ్చారు. అయితే, ఎంత భారీగా భూముల కేటాయింపు జరిగిందనే కంటే, ఆ భూముల్లో వాస్తవంగా ఎన్ని పరిశ్రమలు వచ్చాయి? ఎంతమందికి ఉపాధి లభించింది? అనేదే ముఖ్యం. అయితే పచ్చని పంట భూములను ఇష్టానుసారం పంచేస్తామంటే ఆంధ్రావని ఒప్పదు. పారిశ్రామిక అభివృద్ధి రాష్ట్ర ప్రగతికి అవసరం. కానీ, అది స్థానిక ప్రజల, ముఖ్యంగా రైతుల ప్రయోజనాలను విస్మరించరాదు. ప్రభుత్వం పారిశ్రామిక విధానాలను రూపొందించేటప్పుడే ఈ విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి. భూముల కేటాయింపు ప్రక్రియలో పూర్తి పారదర్శకత చూపాలి. కేటాయించిన భూముల్లో పరిశ్రమలు నిర్మించకపోతే, వాటిని తిరిగి స్వాధీనం చేసుకునే ప్రక్రియ వేగవంతంగా, నిష్పక్షపాతంగా ఉండాలి. భూములు కోల్పోయిన రైతులకు సరైన పరిహారం అందించడమే కాకుండా, ప్రాజెక్టులు రద్దయినప్పుడు భూములను తిరిగి వారికి అప్పగించే విధానాన్ని రూపొందించాలి. ఆర్ అండ్ ఆర్ చట్టం (2013)లో ఈ అంశం కూడా ఉంది. కాని పాలకులు దాని అమలును విస్మరిస్తున్నారు. కేవలం భూముల కేటాయింపుతో చేతులు దులుపుకోకండా, వాస్తవంగా పరిశ్రమలు స్థాపించి, ఉపాధి కల్పించే సంస్థలను ప్రోత్సహించాలి. దీనికోసం నిరుపయోగంగా ఉన్న పారిశ్రామిక భూములన్నింటినీ సమీక్షించి, వాటిని సద్వినియోగం చేయడానికి లేదా రైతులకు తిరిగి ఇవ్వడానికి ప్రభుత్వం ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి. అలా కాకుండా, అభివృద్ధి పేరుతో రైతు హక్కులను ఉల్లంఘించి, వ్యవసాయం లేకుండా అభివృద్ధి చేస్తామంటే అది సాధ్యం కాదు. ?భూములను నిరుపయోగంగా మిగిల్చితే అది రైతన్నలకే గాక రాష్ట్రానికీ తీవ్ర నష్టం. ఆహార భద్రతకు ముప్పు కలుగుతుంది. కాబట్టి పరిశ్రమలు ఏర్పాటు చేయని లేదా పాక్షికంగా ఏర్పాటైన లేపాక్షి, కాకినాడ సెజ్‌లు, వాన్‌పిక్, నిమ్జ్ తదితర ఇండస్ట్రియల్ పార్కుల భూముల్ని సంబంధిత రైతులకు తిరిగివ్వడం న్యాయమైంది. సర్కారు, ఆ దిశగా యోచించాలి. అందుకు ఏలినవారు తలొగ్గేలా సమైక్య రైతు ఉద్యమాలు సాగాలి.

# విద్వేష కాలంలో విస్మృత న్యాయం

శాసన కార్యనిర్వాహక న్యాయ విభాగాలనే మూడు వ్యవస్థల మధ్య సమతుల్యత సాధించే లక్ష్యంతో రాజ్యాంగం రూపొందించబడింది. వలస పాలనా వ్యవస్థ విచ్ఛిన్నం ప్రారంభమైంది. ప్రస్తుతం దేశంలో విద్వేష వ్యాప్తి వాతావరణం ప్రధానంగా హిందూత్వ ద్వారా జరుగుతున్నది. ఇతరులను పరాయివారుగా చూపించడంపై ఇది ఆధారపడి వుంటుంది. కేవలం ఒక్క మతపరమైన గుర్తింపుపైనే గాక అనేక ఇతర గుర్తింపులను కూడా ఇది ఆధారం చేసుకుంటుంది. వాస్తవానికి భారత్ వంటి వైవిధ్యభరితమైన సమాజంలో ఇవన్నీ వుండటం సహజం. ఇది కచ్చితంగా రాజ్యాంగంలో పొందుపర్చుకున్న సమాన పౌరసత్వ సూత్రం నుంచి వైదొలగడమే అవుతుంది. కనుక హిందూత్వ ఎప్పుడైతే దేశ శాసన వ్యవస్థల విధాన నిర్ణయాలను నిర్దేశించే ప్రధాన భావజాలంగా మారిందో పాలనా న్యాయ వ్యవస్థలు అనివార్యంగా ఆ ప్రభావానికి గురవడం తప్పనిసరి.




రాజ్యాంగ ఏర్పాటు ప్రకారం న్యాయ వ్యవస్థ రాజ్యంగ బద్దతను కాపాడే పాత్ర నిర్వహించాలి. ఏమైనా పరిపాలనను శాసించే భావజాలం క్రమేణా ఈ సువ్యవస్థిత సూత్రాన్ని కూడా కూలదోస్తున్నది. కనుక ఇప్పుడు మనం చూస్తున్నట్టుగా వ్యవస్థ లోపలి నుంచి, బయిట నుంచి ఈ న్యాయ సూత్రాన్ని దెబ్బ తీయడం అనేది అత్యంత తీవ్రమైన విషయం. అన్ని స్థాయిల లోనూ రిపబ్లిక్ రాజ్యాంగానికి కట్టుబడిన న్యాయ వ్యవస్థే లేకుండా పోవడం. శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ చర్యల ద్వారా వ్యక్తమవుతున్న భావజాల ప్రాబల్యం తెస్తున్న ఒత్తిళ్లకు లోబడిపోవడం. వీటి వల్ల రాజ్యాంగం నిర్దేశించిన ఏర్పాటుకే ప్రమాదం వాటిల్లుతున్నది. న్యాయపరమైన నియంత్రణ కుప్పకూలిన దానికి అతి పెద్ద ఉదాహరణ తక్కిన రెండు వ్యవస్థలలో కాదు, సాక్షాత్తూ న్యాయ వ్యవస్థలోనే మనకు కనిపిస్తున్నది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిరుద్యోగ యువతనూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం కోసం వాదిస్తున్న న్యాయవాదులనూ బొద్దింకలతో పోల్చారు. ఇక్కడ కాస్త సంతోషం కలిగించే విషయం ఒక్కటే. ఈ తరహా దిగజారుడుకు విరుగుడుగా ఈ రాజ్యాంగావరణాన్ని తిరిగి పొందేందుకోసం ప్రజానీకం ప్రయత్నించడం, ప్రజల మద్దతు లభించడం. బొద్దింకలంటూ ఈసడించిన ఈ వ్యాఖ్య నిరసన హక్కును రక్షించుకోనేలా పురికొల్పింది. పాలనా వ్యవస్థను జవాబుదారీగా నిల్పింది. ప్రభుత్వ పరీక్షల సక్రమ నిర్వహణకూ విశ్వసనీయతకూ సంబంధించిన అంశంపై ఈ ఉద్యమం తీసుకున్న ఉన్నత నైతిక ప్రమాణం పాలకుల పంటి కింద రాయిలా తయారైంది.

**ప్రత్యక్షంగా సిజెఐలే...**

న్యాయ వ్యవస్థలో ప్రధాన న్యాయమూర్తి వ్యక్తిగతంగా భాగం పంచుకున్న మరో కీలక నిర్ణయం ప్రజల ఓటు హక్కు హరించడానికి సంబంధించినది. ఓటు వేసేందుకు రాజ్యాంగం తమకు ఇచ్చిన హక్కును కోల్పోయేలా చేసింది. ఎన్నికల కమిషన్ నిరంకుశంగా తీసుకున్న నిర్ణయం స్వతంత్రతకు సంబంధించిన సమస్యగా చూడటానికే న్యాయ వ్యవస్థ మొగ్గు చూపింది. భారీ సంఖ్యలో ఓటర్లకు రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కు లేకుండా పోతున్న అంశం కంటే కమిషన్ స్వతంత్రతే ముఖ్యంగా న్యాయ వ్యవస్థ భావించడం కూడా రాజ్యంగ ఉద్దేశాలను దెబ్బతీసింది. కమిషన్ జవాబుదారీ తనం అనే సమస్య పూర్తిగా తప్పిపోయింది. అది లేకుండా కమిషన్ స్వతంత్రత గురించి మాత్రమే చెప్పడమంటే వ్యవస్థ రాజకీయ ప్రయోజనాలను నిరంకుశంగా కాపాడటంగా మారుతుంది. దీనికంటే ముందు స్వయంగా సిజెఐ చంద్రచూడ్ – అయోధ్య తీర్పు కచ్చితంగా మసీదును కూల్చివేసిన మూకల విశ్వాసంపై ఆధారపడి ఇచ్చిందేనని ఒక ఇంటర్వ్యూలో బహిరంగంగా చెప్పారు. మరో విధంగా చెప్పాలంటే ఉత్తర్వులున్నాయి కానీ వాటివల్ల న్యాయం జరగలేదు. స్వయంగా న్యాయ వ్యవస్థనే ఈ వాదనకు ఆమోద ముద్ర వేశాక ఇక రాజ్యాంగ సూత్రాలటుంచి చట్టబద్ద పాలన ఎలా బతికి బట్టకడుతుంది?

**దిగువ స్థాయినే సాహసోపేతం**

కానీ ఒకింత సంతోషం కలిగించే విషయమేమంటే న్యాయ వ్యవస్థ దిగువ స్థాయిలో న్యాయాధికారులు సాహసోపేతమైన తీర్పులు ఇవ్వడం. 2020లో మధ్యప్రదేశ్‌లో జరిగిన ఒక మూక హత్యాకాండ నేరంలో జడ్జి తబుస్సుం ఖాన్ ఏడుగురికి యావజ్జీవ శిక్ష విధించడంపైన ఆన్‌లైన్‌లో విద్వేష దాడి మొదలైంది. తీర్పును వదలిపెట్టి ఆమె మత విధేయత పైకి చర్చ మళ్లించబడింది. ఈ దాడి, మతపరమైన దుర్భాషలు, చంపేస్తామనే బెదిరింపుల కారణంగా పోలీసులు ఆమెకు రక్షణ ఇవ్వాల్సి వచ్చింది. ఇందుకోసం హైకోర్టు ఉన్నఫళాన జోక్యం చేసుకోవలసి వచ్చింది. న్యాయవాద వర్గాలు కూడా ఈ బెదిరింపులను ఖండించడం అభినందనీయం. ఇలాంటి ఘటనల వల్ల న్యాయవవస్థ స్వతంత్రత దెబ్బ తింటుందనీ, చట్టబద్ధ పాలనపై నమ్మకం లేకుండా చేస్తుందని వారు హెచ్చరించారు. బాగా జాగ్రత్తగా అధ్యయనం చేశాకనే, చట్టబద్ధమైన ప్రక్రియ పూర్తయ్యాకనే ఆ ఉత్తర్వు ఇవ్వబడింది. చెప్పుకోదగిన విషయమేమంటే ఈ దుర్భాషల పోస్టులకు గానీ కోర్టు విచారణ క్రమంతోగాని ఎలాంటి సంబంధం లేదు. ఈ కారణంగానే సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్లు, రాజకీయవేత్తలు, పౌర సమాజం మొత్తంగా దీన్ని తీవ్ర విషయంగా పరిగణించి జడ్జికి సంఘీభావం తెలిపేందుకు ముందుకొచ్చారు. ఇలాంటి బెదరింపులు సూటిగా న్యాయ వ్యవస్థ స్వతంత్రతను దెబ్బగొడతాయని, న్యాయాధికారులు ధైర్యంగా వ్యవహరించకుండా చేస్తాయని మధ్యప్రదేశ్ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ బెదిరింపులకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిజిపి ని, అదనపు ప్రధాన కార్యదర్శినీ హోం శాఖను ఆదేశించింది. జడ్జికి రక్షణ కొనసాగించాలని చెప్పింది. జడ్జి ఖాన్ పని చేసే చోట బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా వున్న వ్యక్తి దీనిపై వ్యవస్థాగతంగా గట్టి చర్య ఏమీ లేకపోవడమేమిటని ప్రశ్నించారు. గో రక్షక్ అనబడే వారి మూక హత్యాకాండ వల్లనే వాస్తవంగా వ్యక్తి చనిపోవడం ఇక్కడ చెప్పుకోవలసిన విషయం.

**నిరసనలు నిషేధమా?**


రాజ్యాంగ సూత్రాన్ని అద్భుతంగా అమలు చేసిన మరో ఉదాహరణ జస్టిస్ మాధవ్ జామ్దార్ ది. తమను సవాలు చేసిన ఒక పిటిషనర్‌ను నగర బహిష్కారం విధించిన ముంబై పోలీసులను మీ చర్యకు ప్రాతిపదిక ఏమిటని ఆయన తీవ్రంగా మందలించారు. ఆ పిటిషనర్ 'బిజెపి సర్కార్ ముర్దాబాద్, అమిత్ షా ముర్దాబాద్' అని నినాదాలిచ్చారంతే. పౌరులు అలాంటి నినాదాలు ఇవ్వకూడదా? అని ఆయన నిలదీశారు. ఆయన ఇంకా ఇలా వ్యాఖ్యానించారు: ఇదేమిటి? పౌరులంటే భారత ప్రభుత్వ బానిసలా? వారు నిరసనలు తెల్పకూడదు. ఆందోళన చేయకూడదు. ఇదంతా ఏమిటి? ఇప్పుడు ఎన్నో ప్రశ్నా పత్రాలు లీకయ్యాయి. ప్రజలు నిరసన తెల్పితే మీరు కేసులు బనాయిస్తారు. పోలీసులంటే ముఖ్యమంత్రి లేదా ప్రధాన మంత్రి బానిసలు కాదు. వారు ప్రజలకు సేవకులు. నేను ఆ అధికారులపై భారీ జరిమానాలు విధించబోతున్నాను". యాదృచ్ఛికంగా ఇదే బాంబే హైకోర్టు...గాజా మారణకాండపై సిపిఎం నిరసన ప్రదర్శనను నిషేధించిన బాంబే పోలీసులను చర్యను... వెనక్కు తీసుకొనేట్టు చేసింది. అంతకు ముందు 'సర్' కింద ఓటు హక్కు కోల్పోయిన వారి ఫిర్యాదులను విచారించేందుకోసం సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారమే నియమితమైన 19 ట్రిబ్యునళ్లలో ఒకరైన జస్టిస్ టి.ఎస్.శివజ్ఞానం తాను ఆలకించిన 1777 ఫిర్యాదులలోనూ 1717 అన్యాయంగా తొలగించబడ్డాయని తేల్చారు. ఇది 96 శాతమన్నమాట. దీన్ని లెక్క కట్టి చూసినట్టయితే ఓట్లు కోల్పోయిన వారిని తొలగించడం పూర్తిగా తప్పుగానే జరిగిందని అర్థమవుతుంది. అది దాదాపు 25 లక్షల వరకూ వుంటుంది. అలాంటి వాటన్నిటినీ పరిష్కరించాలంటే దాదాపు 20 నుంచి 25 ఏళ్లు పడుతుంది. అయినా దురదృష్టవశాత్తూ అత్యున్నత న్యాయస్థానం ఇంత పచ్చి తప్పులతో జరిగినా 'సర్' రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనేనని చెప్పలేకపోయింది.

**న్యాయం తోడుగావాలి!**

మనం ఒక సంక్లిష్టమైన ఘట్టానికి చేరిపోయాము. చెలరేగిపోతున్న హిందూత్వ భావజాలం నేపథ్యంలోనే న్యాయ వ్యవస్థ పని చేస్తున్నది. శాసన వ్యవస్థ పాలనా వ్యవస్థ ద్వారా దానికి ఆయుధాలు చేకూర్చబడ్డాయి. ప్రజావరణం, ప్రజా నిరసనలు మాత్రమే ఈ సమయంలో ఒకే ఒక అర్థవంతమైన అంశాలుగా కనిపిస్తున్నాయి. ఆ విధంగానే రాజ్యాంగాన్ని కాపాడుకోవడం సాధ్యం. అయితే అలాంటి ప్రజా కార్యాచరణకు బాసటగా నిలవగల ధైర్యం న్యాయ వ్యవస్థ ప్రదర్శిస్తుందా? లేదా? అనేది అంతుపట్టని ప్రశ్న. జడ్జి ఖాన్, జస్టిస్ జామ్దార్, జస్టిస్ శివజ్ఞానం వంటి వారి ఉజ్వల ఉదాహరణలను అనుసరించవచ్చు. దాడులను తిప్పికొట్టి పౌరులకు ఉపశమనం కలిగించవచ్చు. న్యాయ వ్యవస్థ స్వతంత్రత విముక్తి పొందడానికి కూడా ఇదే మహత్తర పాత్ర వహిస్తుంది.

# జాతీయోద్యమ స్ఫూర్తితో సాహిత్యోద్యమం

బ్రిటీష్ పాలన అంతం కావాలని, దేశానికి స్వాతంత్ర్యం సాధించాలని జరిగిన పోరాటంతోపాటే దేశంలో భూస్వామ్య, జమీందారీ వ్యవస్థలకు వ్యతిరేకంగా రైతాంగం తిరుగుబాటు చేసింది. భూస్వాముల కబంధ హస్తాల నుంచి విముక్తి కోసం రైతులు సుదీర్ఘ పోరాటాలు సాగించారు. జమీందారీ వ్యతిరేక ఉద్యమాల్లో వేలాది మంది రైతులు ప్రాణ త్యాగాలు చేశారు. ఈ పోరాటాలకు కవులు, రచయితలు తమ రచనల ద్వారా అపూర్వమైన బలాన్ని చేకూర్చారు. బంకిం చంద్ర చటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం భారత స్వాతంత్ర్య సమరానికి శంఖారావంగా మారింది. యువతలో దేశభక్తిని, పోరాట స్ఫూర్తిని రగిలించింది. బ్రిటీష్ పాలన అంతమవడమే కాదు, దానికి అండగా నిలిచిన భూస్వామ్య, జమీందారీ వ్యవస్థలు కూడా రూపుమాపాలనే సంకల్పం ప్రజల్లో బలపడింది.



తీవ్ర దోపిడీకి గురైన కౌలుదారీ రైతులు తమ హక్కుల పరిరక్షణకు చట్టాలు కావాలని ఉద్యమించారు. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, రవీంద్రనాథ్ టాగూర్, సుబ్రమణ్య భారతి, సరోజినీ నాయుడు, భాగ్యరెడ్డి వర్మ, కుసుమ ధర్మన్న, గరిమెళ్ల సత్యనారాయణ, జాషువా, చిలకమర్తి లక్ష్మీనరసింహం, ఉన్నవ లక్ష్మీనారాయణ, సురవరం ప్రతాపరెడ్డి, హరీంద్రనాథ్ చటోపాధ్యాయ, సుద్దాల హనుమంతు, శ్రీశ్రీ, ఆరుద్ర, దాశరథి కృష్ణమాచార్యులు వంటి కవులు, రచయితలు స్వాతంత్ర్యోద్యమానికి ప్రాణం పోశారు. వారి రచనలు ప్రజల్లో చైతన్యాన్ని రగిలించి ఉద్యమంలో విస్తృత భాగస్వామ్యానికి దోహదపడ్డాయి. భాగ్యరెడ్డి వర్మ, కుసుమ ధర్మన్న, జాషువా, చిలకమర్తి లక్ష్మీనరసింహం, ఉన్నవ లక్ష్మీనారాయణ, సుంకర సత్యనారాయణ వంటి వారి సాహిత్యం, సామాజిక కృషి దళితులు, గిరిజనులు, అణగారిన వర్గాలను ఉద్యమంతో మరింత మమేకం చేశాయి. ఈ విధంగా స్వాతంత్ర్యోద్యమ సాహిత్యం ప్రజా చైతన్యాన్ని విస్తరించి, ఉద్యమాన్ని మరింత సుసంపన్నం చేసింది. స్వాతంత్ర్యానంతరం దేశ నిర్మాణంలోనూ సాహిత్యం కీలక పాత్ర పోషించింది. జాతీయోద్యమం సాధించిన విజయాల ఫలితంగా కొంతమేరకు భూమిలేని వారికి భూములు అందే పరిస్థితి ఏర్పడింది. కౌలుదారీ చట్టాలు రైతులకు అనుకూలంగా రూపొందించబడ్డాయి. చిన్న, సన్నకారు రైతులు నిలదొక్కుకునేందుకు సబ్సిడీలు, పరపతి సౌకర్యాలు అమలులోకి వచ్చాయి. నవభారత నిర్మాణానికి సాహిత్యం మరోసారి నడుంబిగించింది. ప్రేమ్‌చంద్, తాపీ ధర్మారావు, పింగళి లక్ష్మీకాంతం, ఆచార్య ఆత్రేయ, కొండేపూడి లక్ష్మీనారాయణ, పులుపుల శివయ్య, వేములపల్లి శ్రీకృష్ణ, అవంత్స సోమసుందర్, వాసిరెడ్డి సీతాదేవి, శెట్టి ఈశ్వరరావు తదితరులు తమ రచనల ద్వారా ప్రజాస్వామ్య, లౌకిక, అభ్యుదయ విలువలను బలోపేతం చేశారు. స్వేచ్ఛను సార్థకం చేసుకోవాలంటే జమీందారీ, భూస్వామ్య వ్యవస్థలు పూర్తిగా అంతరించాలనీ, కౌలుదారీ రైతులకు రక్షణ కల్పించే చట్టాలు రావాలనీ, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వ మద్దతు, సబ్సిడీలు కొనసాగాలనీ వారు నొక్కిచెప్పారు. దేశం ఆర్థిక స్వావలంబన సాధించాలంటే ప్రభుత్వ రంగ పరిశ్రమలు బలోపేతం కావాలని, బ్యాంకులు, బీమా సంస్థలు వంటి కీలక రంగాలు ప్రజా ప్రయోజనాలకు సేవ చేయాలని ప్రతిపాదించారు. సాధించిన స్వాతంత్ర్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా నాటి రచయితలు సాహిత్యాన్ని సామాజిక మార్పుకు ఆయుధంగా మలిచారు.

## హైదరాబాద్‌కు ఎమిరేట్స్ ‘ఎ-380’ విమానాలు..

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు, సౌకర్యాలను కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. అలాగే తెలంగాణలో కొత్తగా అభివృద్ధి చేయ తలపెట్టిన వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రాధాన్యతను ముఖ్యమంత్రి ఈ భేటీలో వివరించారు. రాష్ట్రంలో విమానయాన రంగానికి ఉన్న విస్తృత అవకాశాలను అందిపుచ్చుకుంటూ, తెలంగాణలోనే ఎమిరేట్స్ సంస్థకు సంబంధించిన MRO (మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్) ఆపరేషన్స్‌ను ప్రారంభించాలని కోరారు.

**గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీకి స్పాన్సర్‌షిప్:**

విమానయాన రంగానికే పరిమితం కాకుండా, గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీలో క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించేందుకు స్పాన్సర్‌షిప్ ఇవ్వాల్సిందిగా ఎమిరేట్స్ యాజమాన్యాన్ని సీఎం కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తి మేరకు హైదరాబాద్ నుంచి ఎమిరేట్స్ సర్వీసులను ప్రారంభించడానికి మహమ్మద్ సర్హాన్ సానుకూలతను వ్యక్తం చేశారు. అలాగే క్రీడాకారులను ప్రోత్సహించే విషయంలో స్పాన్సర్‌షిప్ అందించడంపైన వారు సానుకూలంగా స్పందించారు. ఈ భేటీతో రాబోయే రోజుల్లో తెలంగాణకు అంతర్జాతీయ పెట్టుబడులు, విమాన సర్వీసులు మరింత పెరిగే అవకాశం ఉంది.

## యాదగిరిగుట్టపై సీఎం రేవంత్ ప్లాన్ ఇదే..

(మొదటి పేజీ తరువాయి)



శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ట్రస్ట్ బోర్డు ఎక్స్ అఫీషియో సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేవస్థానానికి చేరుకున్న మంత్రికి ఆలయ అర్చకులు సాంప్రదాయరీతిలో స్వాగతం పలికారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత వేదపండితులు మంత్రి సురేఖకి వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఈవో భవానీ శంకర్ మంత్రి సురేఖకి లక్ష్మీ సమేత నరసింహస్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. చైర్మన్ ఎం.సత్యనారాయణ రెడ్డితో పాటు హాజరైన పాలక మండలి సభ్యులు ఆలయ ముఖమండపం ప్రాంగణంలో మంత్రి సురేఖ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసి, అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందిస్తూ, దేశవ్యాప్తంగా భక్తులకు ఆదర్శ క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు నూతన పాలక మండలి సమిష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్, సభ్యులు అంకితభావంతో పనిచేస్తూ ఆలయ అభివృద్ధి, పారదర్శక పాలన, భక్తులకు మరిన్ని సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఆలయ పవిత్రత, సంప్రదాయాలను కాపాడుతూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని, పాలక మండలి సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి దేవస్థానం మరింత అభివృద్ధి చెందేలా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.

## పారుతున్న నీళ్లను ఎత్తిపోస్తే.. బ్యారేజీలు ఎందుకు..?

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యలతో రాజేందర్ తన గౌరవం కోల్పోయారన్నారు. హరీశ్ రావు సూచనలతో ఈటల రాజేందర్ మాట్లాడారని కాళేశ్వరంపై రాజేందర్ అవాస్తవాలు చెప్పారన్నారు. బీఆర్ఎస్ నేతల వాదననే బీజేపీ ఎంపీ ఈటల వినిపించారన్నారు.

**కిలాడీ కమిటీలో రాజేందర్:**

మేడిగడ్డలో లోపాలు ఉన్నాయని ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు ఉన్నట్లు గత ప్రభుత్వంలో ఈఈ రమణారెడ్డి లేఖ రాశారని రేవంత్ రెడ్డి చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీలో లోపాలు సరిచేయకుంటే ఇబ్బందని లేఖలో పేర్కొన్నారన్నారు. నాడు రాసిన లేఖ పట్ల నిర్లక్ష్యం వహించడం వల్లే మేడిగడ్డ కుప్పకూలిందన్నారు. మేడిగడ్డలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతూ ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందని ప్లానింగ్, డిజైన్, నిర్మాణంలో లోపాలు ఉన్నట్లు ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందన్నారు. 2022 జులైలో కన్నెపల్లి పంప్ హౌస్ మునిగిపోతే సరిచేయలేదన్నారు. ఎన్డీఎస్ఏ క్షేత్రస్థాయిలో పనిచేసేలా 2021లో కేంద్రం చట్టం చేసింది. ఎన్డీఎస్ఏ మేడిగడ్డను సందర్శించి.. అందులో నీటి నిల్వ సాధ్యం కాదని చెప్పిందన్నారు. సీడబ్ల్యూసీ ప్రకారమే ప్రాజెక్టుపై ముందుకెళ్లాలని ఎన్డీఎస్ఏ చెప్పింది. 80 వేల పుస్తకాలు చదివిన మేధావుల మాటలుగానీ.. ఖిలాడీ కమిటీల సూచనలు గానీ పట్టించుకోవద్దని ఎన్డీఎస్ఏ చెప్పిందన్నారు. ఎత్తిపోతల అంటే ఏంటో అమెరికాలో చదివిన కేటీఆర్ కు తెలియదా అని ప్రశ్నించారు. ఎన్డీఎస్ఏ నివేదిక మేరకే కమిటీ వేసి బ్యారేజీల పునరుద్ధరణకు యత్నిస్తామన్నారు. మమ్మల్ని బద్నాం చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ప్రజల ముందు 2 కమిటీలు ఉన్నాయని ఒకటి కిలాడీ కమిటీ, రెండోది ఎన్డీఎస్ఏ వేసిన కమిటీ ఉందన్నారు. కిలాడీ కమిటీలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, ఈటల సభ్యులుగా ఉన్నారని మండిపడ్డారు.

## రేవంత్ రెడ్డికి శీల పరీక్ష చేయాలి..

(మొదటి పేజీ తరువాయి)

**మేడిగడ్డతో పని లేకుండానే నీళ్లు లిఫ్ట్ చేయవచ్చు..**

మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూసివేయకుండానే కేవలం కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చని రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ప్రభుత్వానికి లేఖ రాసిన విషయాన్ని కేటీఆర్ బహిర్గతం చేశారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద 96.79 మీటర్ల మేర నీటి ప్రవాహం ఉందన్నారు. కానీ కేవలం 94 మీటర్ల లభ్యత ఉంటేనే పంపులను ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేయవచ్చని నిపుణులు స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ ప్రకృతి ప్రసాదించిన ఈ ప్రవాహం మరో 100 రోజులు ఇలాగే ఉంటుందని తెలిపారు. రోజుకు 2 టీఎంసీల చొప్పున మొత్తం 200 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే.. గోదావరి బేసిన్‌లోని అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి అన్ని జలాశయాలను నింపి తెలంగాణను సస్యశ్యామలం చేయవచ్చని కేటీఆర్ వివరించారు.

**ఇది కాలం తెచ్చిన కరువు కాదు..**

రాష్ట్రంలో నీళ్లు లేక రైతులు ఏడుస్తుంటే, కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయాలనే కుట్రతోనే సీఎం రేవంత్ రెడ్డి నీళ్లివ్వడం లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని ఎద్దేవా చేశారు. 2022 వరదల ఫోటోలు చూపించి కన్నెపల్లి మునిగిపోయిందంటూ అడ్డమైన మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టు వల్ల మునిగే భద్రాచలాన్ని పట్టుకుని.. మేడిగడ్డ వల్లే మునుగుతోందని బుద్ధిలేని మాటలు రేవంత్ మాట్లాడుతుండని కేటీఆర్ ఫైర్ అయ్యారు. గోదావరిలో లక్షల క్యూసెక్కుల వరద నీరు కళ్లముందు కిందకు పోతుంటే.. ఎత్తిపోయడానికి నీళ్లు లేవనేవాడు బుద్ధితక్కువ వాడా? లేక రైతుల కోసం నీళ్లివ్వమనేవాడు బుద్ధితక్కువ వాడా? అని కేటీఆర్ అన్నారు.

**హరీష్‌రావు కేసీఆర్ తయారు చేసిన సైనికుడు**

ఇక మాజీ మంత్రి హరీష్ రావుపై వస్తున్న పుకార్లను కేటీఆర్ గట్టిగా తిప్పికొట్టారు. హరీష్ రావు పార్టీ ఆవిర్భావం కంటే ముందు నుంచే కేసీఆర్‌కు రక్షణ కవచంగా నిలిచిన సైనికుడని కేటీఆర్ కొనియాడారు. తనపై వచ్చిన పుకార్లను ఆయన వందల సార్లు తిప్పికొట్టారని అన్నారని.. తమకు క్యారెక్టర్ చాలా ముఖ్యమని అన్నారు. నాలుగు పార్టీలు మారిన రేవంత్ రెడ్డి.. హరీష్ రావు శీల పరీక్ష గురించి మాట్లాడటం హాస్యాస్పదమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి పోతే పొద్దున కాంగ్రెస్‌తో, రాత్రికి బీజేపీ వాళ్లతో ఉంటారని.. శీల పరీక్ష చేయాల్సింది రేవంత్ రెడ్డికేనని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి పాలన ఇలాగే ఉంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు 117 అసెంబ్లీ స్థానాలు కాదు కదా.. కనీసం 7 సీట్లు కూడా రావని కేటీఆర్ కామెంట్ చేశారు.

# మార్చి 2027 నాటికి భూ రీ-సర్వే పూర్తి..

(మొదటి పేజీ తరువాయి)

**భూ రీ-సర్వే తప్పనిసరి..**

భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందుకోసం శిక్షణ పొందిన 5,700 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి ఆయా గ్రామాల రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. రీ-సర్వేకు అవసరమైన అత్యుత్తమ నాణ్యత గల పరికరాలను జిల్లా స్థాయిలో కొనుగోలు చేయాలని, కొనుగోలు ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకొని, అవసరమైన సిబ్బంది, పరికరాలు, మౌలిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు. ప్రతి నెల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పురోగతిని సమీక్షిస్తామని, మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 చెల్లించి మొత్తం రూ.60 అందజేస్తామని తెలిపారు. చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జూలై 28లోపు విధుల్లో చేరని లైసెన్స్ సర్వేయర్ల లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. వారికి బీమా, సామాజిక భద్రత కల్పించే చర్యలు కూడా తీసుకుంటామని వెల్లడించారు. ఒక సర్వే నంబరులో కొంత భూమి మాత్రమే ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించి, నోటీసులు త్వరితగతిన జారీ చేయాలని సూచించారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి, మిగిలిన పనులకు అనంతరం నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. నిధులు విడుదలైనా పనులు చేపట్టని చోట్ల బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని స్పష్టం చేశారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేసి గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, మొదటి విడతలో మంజూరు కాని అర్హుల ఇళ్లను కూడా రెండో విడతలో చేర్చి మంజూరు చేయాలని సూచించారు. ఇసుక, కంకర సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

## దేశంలో తొలి సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీస్ హబ్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

**ప్రణాళికాబద్ధంగా కృషి:**

ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... తెలంగాణను దేశంలోనే ప్రముఖ సెమీకండక్టర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ లక్ష్య సాధనలో తాజాగా ప్రారంభించిన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ హబ్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సెమీకండక్టర్ చిప్‌ల తయారీలో వాఫర్‌ను సమతలంగా మార్చేందుకు ఉపయోగించే ఈ సీఎంపీ ప్యాడ్లను ప్రస్తుతం పూర్తిగా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నామన్నారు. ఈ హబ్ ఏర్పాటుతో ఇప్పటివరకు విదేశాలకే పరిమితమైన సీఎంపీ ప్యాడ్ టెక్నాలజీ తొలిసారిగా దేశంలో హైదరాబాద్ వేదికగా అందుబాటులోకి వచ్చిందన్నారు.

**ప్రత్యేక రోడ్‌మ్యాప్:**

విద్యార్థులు, పరిశోధకులు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, పరిశ్రమలకు ఈ కేంద్రం ద్వారా శిక్షణతో పాటు పరిశోధనలు చేపట్టేందుకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామన్నారు. ప్రముఖ విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈల భాగస్వామ్యంతో వచ్చే 18 నుంచి 24 నెలల్లో సీఎంపీ ప్యాడ్లను దేశంలోనే తయారు చేసేలా సంయుక్త పరిశోధనలు చేపడతామని వివరించారు. సెమీకండక్టర్ రంగంలోని అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు జపాన్ లాంటి దేశాలతో కలిసి ముందుకు సాగుతున్నామన్నారు. పరిశోధన నుంచి చిప్‌ల తయారీ వరకు అవసరమైన సమగ్ర ఎకోసిస్టమ్‌ను రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తోహో కోకి సీసాకుషో కంపెనీ లిమిటెడ్ ప్రతినిధి టకుయా నిషిమురా, జెట్రో బెంగళూరు డైరెక్టర్ జనరల్ స్వస్తిక్ కులకర్ణి, ఇండోబాక్స్ వ్యవస్థాపకుడు, సీఈవో డైసుకే టాంజి, జపాన్ ఇండియా బిజినెస్ బ్యూరో ఛైర్మన్ షిగెమారో యాసుయి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీ-వర్క్స్ సీఈవో జోగిందర్ తనికెళ్ల పాల్గొన్నారు.

## కొత్తపేటలో ‘క్వీన్ బాస్కెట్’ సీజన్-1 ఎగ్జిబిషన్

**సందర్శకులను ఆకట్టుకుంటున్న శ్రీ లీల సారీస్ బోటిక్ స్టాల్**



**నిర్భయవార్త ప్రతినిధి : కొత్తపేట:**

కొత్తపేటలోని రాజధాని గార్డెన్స్‌లో శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ‘క్వీన్ బాస్కెట్’ సీజన్-1 లైఫ్ స్టైల్ & ఫ్యాషన్ ఎగ్జిబిషన్ సందర్శకులతో కళకళలాడుతోంది. ఈ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన స్టాల్ నెంబర్ 42లో ఉన్న ‘శ్రీ లీల సారీస్ & బోటిక్’ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ సందర్భంగా స్టాల్ నిర్వాహకులు ముందూరి లీలానాథ్, హరినాథ్ దంపతులు మాట్లాడుతూ, “ఫ్యాషన్ ప్రియుల కోసం తాము ఎంచుకున్న లేటెస్ట్ కలెక్షన్స్, సారీస్ మరియు ఇమిటేషన్ జ్యువెలరీకి ఎగ్జిబిషన్‌లో విశేష స్పందన లభిస్తోంది. మహిళల అభిరుచులకు తగ్గట్టుగా ప్రత్యేకమైన డిజైన్లను అందుబాటులో ఉంచాం. ఈ ఎగ్జిబిషన్ ఈరోజుతో పాటు ఆదివారం కూడా కొనసాగుతుంది. కొత్తపేట పరిసర ప్రాంతాల ప్రజలు మరియు ఫ్యాషన్ ప్రియులు మా స్టాల్ నెంబర్ 42ని సందర్శించి, మా ప్రత్యేక ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాము” అని తెలిపారు.వీరు హైదరాబాద్, కొత్తపేటలోని శ్రీ లక్ష్మీ వైట్ హౌస్ హ్యాండ్లూమ్స్ లో ప్రధాన కార్యాలయాన్ని కలిగి ఉన్నారు. అలాగే శ్రీనగర్ కాలనీలోని ఎల్లారెడ్డిగూడ వద్ద ఉన్న తమ ప్రధాన షాపును కూడా సందర్శించవచ్చని వారు తెలిపారు. మరిన్ని వివరాలకు మరియు ఆన్‌లైన్ కలెక్షన్స్ కోసం 7981111909, 9866661872 నంబర్లను సంప్రదించవచ్చని వారు తెలిపారు.

## ఆ ఆరు హత్యలకు బాధ్యుడు సీఎం రేవంతే..

**రాజీనామాకు టీఆర్ఎస్ చీఫ్ కవిత డిమాండ్**

**నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:**



రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని దైవాలగూడలో జరిగిన ఆరు హత్యలు రాష్ట్రాన్ని షేక్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పడంపై విపక్షాలు, అధికార పక్షాల మధ్య విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. తాజాగా, కల్వకుంట్ల కవిత ఈ ఆరు హత్యలపై ‘ఎక్స్’ (ట్విట్టర్) వేదికగా శనివారం రియాక్ట్ అయ్యారు. హైదరాబాద్ నగర శివార్లలో ఒకేరోజు ఆరు హత్యలు జరిగాయంటూ రాష్ట్రంలో ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ ఉన్నాయా అనే అనుమానం కలుగుతోందని అన్నారు. పోక్సో కేసులో అరెస్ట్ అయి బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడు 17 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి ఆమెను, తల్లిని, నాయనమ్మను అతి కిరాతకంగా హత్య చేశాడని కవిత పేర్కొన్నారు. చివరికి కనికరం కూడా లేకుండా భార్య, పిల్లలను చంపేయడం దారుణమని అన్నారు. ఇన్ని హత్యలు చేస్తున్నా నిఘా వ్యవస్థ, పోలీసులు నిందితుడిని ఆపలేకపోవడం సిగ్గుచేటని కామెంట్ చేశారు. ఇంతటి క్రూర నేర ప్రవృత్తి ఉండి పరారీలో ఉన్న నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని.. కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక రాష్ట్రంలో ఆరుగురి హత్యలకు కారణమైన, సీఎం మరియు హోంమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రేవంత్ రెడ్డి తన పదవులకు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## అటవీ హక్కుల చట్టం కేంద్ర పరిధిలో ఉంది: మంత్రి జూపల్లి కృష్ణారావు

**నిర్భయవార్త ప్రతినిధి : ఆసిఫాబాద్:**



ఏళ్లుగా అటవీ భూములను సాగు చేసి జీవనం సాగిస్తున్న ట్రైబల్ నాన్ ట్రైబల్ పోడు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అయితే అటవీ హక్కుల చట్టం కేంద్ర పరిధిలో ఉందని జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం కెరమెరి మండలంలో వీఓ నూతన భవనం ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయనను సిర్పూర్ యు.లింగపూర్, జైనూర్, కెరమెరి మండలాలకు చెందిన పోడు రైతులు ఎమ్మెల్యే కోవలక్ష్మి ఆధ్వర్యంలో మంత్రిని కలిసి తమ గోడును వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2005 కంటే ముందు నుంచి పోడు సాగు చేస్తున్న చాలా మంది రైతులకు గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎఫ్వోఆర్వో పట్టా ఇచ్చామని గుర్తు చేశారు. మరికొంత మంది 50, 60 ఏళ్లుగా సాగు చేస్తున్నా పట్టాలు లేకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఫారెస్ట్ అధికారుల నుంచి ఈ ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పుకొచ్చారు. అయినా పోడు రైతులను ఇబ్బంది పెట్టొద్దని ఫారెస్ట్ అధికారులకు చెప్పాం.. మళ్లీ పిలిపించి చెప్తామని తెలిపారు. అలాగే కొత్త పోడు కొట్టొద్దని విజ్ఞప్తి చేశారు.

# ‘సర్’ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలి:

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి









కూకట్పల్లి జూలై 11 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పూరణపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, ప్రతి దశను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. శనివారం కూకట్పల్లి నియోజకవర్గంలోని బాలాజీ నగర్ వార్డు కార్యాలయంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్ఓలతో మాట్లాడిన ఆయన, ఫారాల పంపిణీ సక్రమంగా జరుగుతున్నదా, ఓటర్లు నింపిన ఫారాలను తిరిగి స్వీకరిస్తున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించిన సుదర్శన్ రెడ్డి, ఫారాల పరిశీలన, డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. డిజిటలైజేషన్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఆపరేటర్లతో అత్యంత జాగ్రత్తగా పని చేయించాలని సూచించారు. బీఎల్ఓలు సేకరించిన ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజ్ చేయాలని స్పష్టం చేశారు. అనంతరం అదే ప్రాంతంలోని అపార్ట్‌మెంట్‌లలో బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఫారాల పంపిణీ, సేకరణ, అప్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఓటర్లకు ఫారాలు పూరించడంలో అవసరమైన మార్గదర్శకత్వం, సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఇంటి వద్ద అందుబాటులో లేని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు సేకరించి వారికి ఫారాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, అందుబాటులో లేని ఓటర్ల వివరాలను సంబంధిత సూపర్వైజర్లకు వెంటనే తెలియజేయాలని బీఎల్ఓలకు సూచించారు. 2002 తర్వాత అర్హత పొందిన ఓటర్లకు సంబంధించిన ఫారాలను ఎలా పూరించాలనే అంశంపై కూడా సీఈవో బీఎల్ఓలకు స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు. తదనంతరం కేపీహెచ్‌బీ 6వ ఫేజ్‌లోని అపార్ట్‌మెంట్‌లను సందర్శించిన సుదర్శన్ రెడ్డి, అక్కడ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పరిశీలించి ఓటర్లతో నేరుగా మాట్లాడారు. వారి సందేహాలను నివృత్తి చేస్తూ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించారు. అనంతరం ఇండో ఫార్చ్యూన్ గ్రేటర్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సందర్శించి బీఎల్ఓల పనితీరును సమీక్షించారు. అక్కడికి వచ్చిన ఓటర్ల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ కార్యక్రమం సజావుగా కొనసాగేందుకు అవసరమైన సూచనలు చేశారు. ఈ పర్యటనలో కూకట్పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, కూకట్పల్లి ఎమ్మార్వో అశోక్, సూపర్వైజర్లు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ లో జరిగిన అగ్నిప్రమాదంలో మరణించిన నక్క వెంకటరమణకుటుంబానికి ఆర్థిక సహాయం



నిర్భయవార్త ప్రతినిధి : విశాఖ స్టీల్ ప్లాంట్ లో 8/6/2026 తేదీన జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించిన నక్క వెంకటరమణకుటుంబానికి రాష్ట్ర సగర ఉపాధ్యాయ ఉద్యోగుల పెన్షన్దారుల సంఘం నుంచి 100000 రూ.. ఆర్థిక సహాయం వారి కుటుంబ సభ్యులు అందించారు. ఈకార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సగర ఉపాధ్యాయ ఉద్యోగుల పెన్సుందర్ల సంఘం ప్రధాన కార్యదర్శి నక్క కృష్ణమూర్తి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సగర వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గుర్రం నూకరాజు. రాష్ట్ర ఉద్యోగుల సంఘం జాయింట్ సెక్రెటరీ తంగేళ్ల ప్రభాకర్ రావు గార్ల సమక్షంలో ఆర్థిక సాయం చెక్కును అందజేశారు. రాష్ట్ర ఉద్యోగుల సంఘం కమిటీ సభ్యులు వై.వి వెంకట్రావు విశాఖ జిల్లా సగర సంగం అధ్యక్షులు గుర్రాల దేముడు వర్కింగ్ ప్రెసిడెంట్ గజ్జల రాంబాబు ఉపాధ్యక్షులు ద్రోణాద్రి అప్పలనాయుడు మరొక ఉపాధ్యక్షులు ములికి లోవబాబు సిలవల సూర్యనారాయణ సైంటిస్ట్ నక్క రామకృష్ణ పోలీస్ డిపార్ట్మెంట్ గారపాటి శ్రీనివాసరావు గార్లు కలిసి వారి కుటుంబానికి ధైర్యం చెప్పడం జరిగింది

## ప్రతి ఓటరు చైతన్యం కావాలి. మేకల మల్లి బాబు యాదవ్



కామేపల్లి/ఖమ్మం జూలై 11 నిర్భయవార్త రిపోర్టర్. ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (ఎఐఆర్)2026లో భాగంగా గత నెల 25న తెలంగాణతోపాటు 16 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల గణన ప్రక్రియ ప్రారంభమైందని, దీనికి గాను బిఎల్వోలు ఇంటికి వచ్చి ఎన్యుమరేషన్ ఫారం ను ఇవ్వడం జరుగుతుందని, దానిని జాగ్రత్తగా నింపి తిరిగి బిఎల్ఓ కు ఇవ్వాల్సిన అవసరం ఉందని, ఈ విషయమై ప్రతి ఓటరు చైతన్యంగా ఉండి నిర్లక్ష్యం చేయకుండా ఓట్లను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య నియోజకవర్గం స్థాయిలో విస్తృత ప్రచారం చేస్తూ ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారని, అదేవిధంగా ఓటర్లకు సహకరించడానికి కాంగ్రెస్ పార్టీపరంగా బిఎల్ఎ లను ఏర్పాటు చేయడం జరిగిందని, వారు అందుబాటులో ఉంటారని,డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ తెలిపారు. ఈరోజు బి ఎల్ ఓ, గ్రామ కార్యదర్శి శంకర్ ప్రతి ఇంటికి తిరుగుతూ ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న నేపథ్యంలో మల్లి బాబు యాదవ్ ఇంటికి విచ్చేసి, ఎన్యుమరేషన్ ఫారాలను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాన్ని ఎలాంటి లోపాలు లేకుండా నింపి బిఎల్ఓ కు ఈనెల 24 లోగా తిరిగి ఇవ్వాలని, అప్పుడే వారి పేరు ఓటర్ల జాబితాలో ప్రచురించడం జరుగుతుందని, లేనిపక్షంలో అర్హులై ఉండి కూడా ఓటును పోగొట్టుకోవాల్సిన అవసరం ఉంటుందని, ఓటే కదా పోతే పోయిందిలే అని నిర్లక్ష్యం వహించ కూడదని, రాబోయే రోజులలో ఓట్లను పరిగణన లోకి తీసుకొని ప్రభుత్వం పథకాలను అమలు చేసే అవకాశం ఉందని తెలిపారు. దేశంలో కొత్తగా చొరబడిన వారు, ఒకే వ్యక్తి రెండు మూడు చోట్ల ఓట్లు కలిగి ఉండిన వారు, చనిపోయిన వారు ఓట్లకు అనర్హులని, అలాంటి వారి ఓట్లు తొలగించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఎన్యుమరేషన్ ఫారం లు సరిగా అవగాహన లేక నింప లేకపోతే బి ఎల్ వో లు మరియు బిఎల్ఏలు దగ్గరుండి ఫారంలు నింపించాల్సిన అవసరం ఉందని, లేకపోతే అర్హులైన ఓట్లు తొలగించబడే అవకాశం ఉందని, నిర్దేశించిన ఈనెల 24వ తేదీని పొడిగించే అవకాశం కూడా లేదని ఎన్నికల సంఘం ప్రకటించడం జరిగిందని, పేర్లలో ఏమైనా మార్పులు ఉంటే బిఎల్వోలు దగ్గర ఫారం 6, ఫారంశీ. 8 ద్వారా సరి చేయించుకోవచ్చని, ఒకవేళ ఒకచోట కాకుండా రెండు మూడు చోట్ల ఓట్లు కలిగి ఉన్నవారు శిక్షార్హులతారని తెలిపారు. కావున ప్రతి ఓటరు జాగ్రత్తగా ఉండాలని, ఫారం ను జాగ్రత్తగా నింపి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమం లో గ్రామ కార్యదర్శి శంకర్, గ్రామ పంచాయతీ సిబ్బంది వంశీ,బిఎల్ఏ లు పాటిబండ్ల ప్రసాద్ బానోత్ రాములు, జక్కంపూడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించే గొంతులపై కేసులు సరికాదు.

నందిగామ, నిర్భయవార్త రిపోర్టం.ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ అధికార పార్టీ నాయకుల పనితీరును ప్రశ్నిస్తున్న ప్రతిపక్షనాయకులపై వరుసగా కేసులు నమోదు చేయడం ఆందోళనకరమని నందిగామ నియోజకవర్గ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఉలవలపూడి నరేంద్ర (నాని) పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విమర్శలు, ప్రతివిమర్శలు,భిన్నాభిప్రాయాల వ్యక్తీకరణసహజమైనవేనని, వాటిని చట్టపరమైన కేసులతో ముడిపెట్టడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమనిఆయన అన్నారు.రాజకీయకక్షసాధింపు ధోరణిలో భాగంగానే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దుకూరు సాయిబాబుపై కేసులునమోదు చేశారని ఆరోపించారు.

# భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలి... రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

## భూ భారతి విజయవంతమైన అమలుకు భూ రీ-సర్వేనే కీలకం

## భూ రీ-సర్వే, ఇందిరమ్మ ఇండ్లు, సాదా బైనామా దరఖాస్తులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రి పొంగులేటి

ఖమ్మం, జూలై- 11 నిర్భయవార్త రిపోర్టర్.భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్రవ్యాప్తంగా భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు. భూ రీ-సర్వే, భూ భారతి అమలు, సదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై మంత్రి, శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని, రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని తెలిపారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి, హైకోర్టు సమస్యను కూడా పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందని, తిరస్కరణ లకు గల కారణాలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీ-సర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందు కోసం శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లకు ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీ-సర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి ములుగుమాడు గ్రామ రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీ-సర్వే చేపట్టినట్లు తెలిపారు. రీ-సర్వేకు అవసరమైన అత్యుత్తమ నాణ్యత గల పరికరాలను జిల్లా స్థాయిలో కొనుగోలు చేయాలని, కొనుగోలు ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు భూ రీ-సర్వేను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని అవసరమైన సిబ్బంది,పరికరాలు, మౌళిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు.ప్రతి నెల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిని సమీక్షిస్తామని, మార్చి-2027 నాటికి మూడు విడతల్లో రీ-సర్వే పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రీ-సర్వేలో పనిచేసే లైసెన్స్ సర్వేయర్లకు ఎకరానికి రూ.50తో పాటు రవాణా, ఇతర ఖర్చుల కోసం మరో రూ.10 చెల్లించి మొత్తం రూ.60 అందజేస్తామని తెలిపారు. చెల్లింపులు వెంటనే జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విధుల్లో చేరని లైసెన్స్ సర్వేయర్లకు గడువిచ్చి, గడువులోగా చేరని వారి లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. లైసెన్స్ సర్వేయర్లకు బీమా, సామాజిక భద్రత కల్పించే చర్యలు కూడా తీసుకుంటామని వెల్లడించారు. ఒక సర్వే నంబరులో కొంత భూమి మాత్రమే ప్రభుత్వ అవసరాలకు సేకరించినప్పటికీ మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంచడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించి నోటీసులు త్వరితగతిన జారీ చేయాలని సూచించారు. పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన 6,500 రెవెన్యూ సమస్యల్లో 98 శాతం సమస్యలకు భూ రీ-సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి, మిగిలిన పనులకు నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. నిధులు విడుదలైనా పనులు చేపట్టని చోట్ల బాధ్యులైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేసి గుడిసెల్లో నివసించే కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, మొదటి విడతలో మంజూరు కాని అర్హుల ఇళ్లను కూడా రెండవ విడతలో చేర్చి మంజూరు చేయాలని సూచించారు. ఇసుక, కంకర సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ-సర్వేను నవంబర్ లోపు పూర్తి చేయాలని, రెండవ విడతలో మరో 70 గ్రామాల్లో మార్చి-2027లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రీ-సర్వే పూర్తయితే సాదాబైనామా దరఖాస్తుల తిరస్కరణలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు.తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో గుడిసెలను గుర్తించిన వాటిలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి ఆగస్టు నాటికి రెండు లక్షల ఇళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని, పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలని సూచించారు. సెర్ప్ సీఈవో దివ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థుల యూనిఫాంలన్నీ స్వయం సహాయక సంఘాల మహిళా టైలర్ల ద్వారానే కుట్టిస్తున్నామని తెలిపారు. టెండర్ ఆలస్యంతో వస్త్రం ఆలస్యంగా వచ్చినప్పటికీ జూలై 15లోపు రెసిడెన్షియల్ బాలికలకు, జూలై 30లోపు బాలురకు యూనిఫాంలు అందించాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రంలోని ప్రతివిద్యార్థికి కనీసం ఒక జత యూనిఫాం అందేలా కలెక్టర్లు, డీఆర్‌డీఏ, గురుకులాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ పొందిన స్వయం సహాయక సంఘాల టైలర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారని తెలిపారు.ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎన్ మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో భూ రీ-సర్వే చేపట్టామని, నాలుగు యంత్రాలను సీఎస్ఆర్ నిధుల ద్వారా కొనుగోలు చేశామని తెలిపారు. గ్రామాల మధ్య సరిహద్దు సమస్యలపై ప్రత్యేక సమన్వయంతో ముందుకు సాగుతున్నామని, భూ రీ-సర్వేపై ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సర్వే అనంతరం నోటీసులు జారీ చేస్తుండగా ఇప్పటివరకు కుటుంబ వివాదాలు మినహా పెద్దగా అభ్యంతరాలు రాలేదన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# 100 కోట్ల రూపాయల ఆస్తి కాజేసిన కొడుకు..

### సిఎంనీ కలసి వినతి.



శ్రీకాకుళం, నిర్భయవార్త ప్రతినిధి : కోట్ల రూపాయల విలువైన ఆస్తితో పాటు హోటల్ నాగావళిని తమ కుమారుడు అక్రమంగా కాజేశాడని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 95 ఏళ్ల వయస్సు గల తమ తండ్రిని కుమారుడు వేధిస్తున్నాడని, న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించినప్పటికీ సరైన సహకారం లభించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, ప్రశ్నించిన తమపైనే తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో అధికారులు కూడా సహకరించడం లేదని బాధితులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారి ఫిర్యాదును విన్న ముఖ్యమంత్రి, కేసును పరిశీలించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తూ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# మైనర్ బాలిక అపహరణ, నిందితుడి అరెస్ట్, రిమాండ్.



పల్నాడు జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి :పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చల్లగుండ్ల అడ్డరోడ్డుకు చెందిన 14 ఏళ్ల మైనర్ బాలిక అదృశ్యం కేసులో నిందితుడు సుర్తని వసంత్ అలియాస్ శ్యామ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 5న బాలిక కనిపించకుండా పోవడంతో తొలుత మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తులో భాగంగా బాలికను సురక్షితంగా రక్షించారు. నిందితుడు మాయమాటలు చెప్పి తనను తీసుకెళ్లినట్లు బాలిక ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా, పోలీసులు ఈ కేసులో పోక్సో చట్టంతో పాటు అపహరణ సెక్షన్లను చేర్చారు. శుక్రవారం ఉదయం నకరికల్లు కారంపూడి అడ్డరోడ్డు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకుని, కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం అతడికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

# పెనుగంచిప్రోలు చారిత్రాత్మక మసీదు అభివృద్ధికి ఆర్థిక సాయం.

జగ్గయ్యపేట, నిర్భయవార్త ప్రతినిధి :.జగ్గయ్యపేటనియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు చారిత్రాత్మక మసీదు అభివృద్ధి పనుల కోసం వైసీపీ నాయకులు, ముస్లిం చైతన్య వేదిక అధ్యక్షులు దుబాయ్ కరీముల్లా, వారి పిల్లలు హీన, సోహెల్ ఆర్థిక సహాయం అందజేశారు. స్థానికంగా మొఘల్



చక్రవర్తి ఔరంగజేబు కాలంలో నిర్మించబడినట్లు ప్రసిద్ధి చెందిన ఈ మసీదు అభివృద్ధికి నిర్వహించిన కార్యక్రమంలో జగ్గయ్యపేట వైసీపీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, నందిగామ మాజీ ఎమ్మెల్యే డా. మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో మసీదు కమిటీ సభ్యులకు నిధులు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మత సామరస్యం, చారిత్రక కట్టడాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మసీదు అభివృద్ధి కార్యక్రమాలకు తమ సహకారం కొనసాగుతుందని తెలిపారు. మసీదు కమిటీ సభ్యులు నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, అందించిన నిధులు అభివృద్ధి పనులకుఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకులు, పెనుగంచిప్రోలు ముస్లిం పెద్దలు, ఇమామ్‌లు, మౌజన్‌లు, మసీదు కమిటీ సభ్యులు, నందిగామ కౌన్సిలర్, వైసీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ యాకూబ్ అలీ (కట్టప్ప), సుభాని, మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

# బత్తుల చిన్నబ్బాయిపై పిట్.ఎన్.డి.పి.ఎస్ యాక్ట్..

విజయవాడ, నిర్భయవార్త ప్రతినిధి :ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర బాబు,ఆదేశాల మేరకు భవానిపురం సిఐ ఉమామహేశ్వరరావు, చిన్నబ్బాయి అనే ఓ ముద్దాయిపై పిట్.ఎన్.డి.పి.ఎస్ యాక్ట్ నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. గంజాయి కొకైన్ మరియు పలు మాదకద్రవ్యాలు అమ్మిన సేవించిన ప్రజలకు ఏమైనా సమస్యలు సృష్టించి లాండఆర్డర్ అదుపు తప్పితే ఊరుకునేది లేదని ఎంతటి వారినైనా చట్ట ప్రకారం చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో భవానిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అమ్మకాలు సేవించడం పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న చిన్న బాబు అనే వ్యక్తిపై పిట్. ఎన్.డి.పి.ఎస్ యాక్ట్ నమోదు చేశారు. సీఐ ఉమామహేశ్వర రావు తెలిపిన వివరాల మేరకు,గంజాయి మరియు వివిధ కేసులలో ఉన్న ముద్దాయిని , పిట్ ఎన్.డి.పి.ఎస్ యాక్ట్ (ప్రెవెన్షన్ ఆఫ్ ఇల్లిసిట్ ట్రాఫిక్ ఇన్ నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్స్టెన్సెస్ యాక్ట్–1988)లో అరెస్టు చేసి ,రాజమండ్రి సెంట్రల్ జైలుకి తరలించామని సీఐ తెలిపారు. భవానిపురం మరియు వివిధ స్టేషన్లలో ఉన్న,గంజాయి మరియు వివిధ కేసులలో ముద్దాయి అయిన బత్తుల చిన్నబ్బాయి గా/శే నారాయణ, వయసు 48 సంవత్సరాలు, వైయస్సార్ కాలనీ, జక్కంపూడి, విజయవాడ రూరల్ మండలం అను అతని నీ గవర్నమెంట్ వారి ఉత్తర్వులు ప్రకారం అదుపులోకి తీసుకుని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించడమైనది. ఇతను గవర్నమెంట్ వారి ఉత్తర్వుల ప్రకారం ఒక సంవత్సరం కాలం పాటు జైలు జీవితం గడుపుతాడు. కావున ప్రజలు గంజాయి మరియు మత్తు పదార్థాలు అమ్మకము ,త్రాగటం నేరము అని గమనించి దాని జోలికి వెళ్ళకుండా ఉండవలెనని,లేనిచో చిన్నబ్బాయి లాగానే పిట్.ఎన్.డి.పి.ఎస్ యాక్ట్ కేసు పెట్టించుకుని జైలు జీవితం గడపవలసి ఉంటుంది .కావున ప్రజలందరూ గమనించగలరని భవానిపురం సీఐ ఉమామహేశ్వరరావు,పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు.



# లాభాల్లో వ్యాపారస్తులు.

### ఆస్పత్రులు పాలవుతున్న ప్రజలు.

### నిద్రపోతున్న సంబంధిత అధికార యంత్రాంగం .

పాడేరు,అల్లూరి జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి :అల్లూరి జిల్లా కేంద్రం పాడేరుతో పాటు ఏజెన్సీ ప్రాంతంలోని అనేక హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, చికెన్ సెంటర్లలో ప్రజల ఆరోగ్యాన్ని పూర్తిగా పణంగా పెట్టి వ్యాపారాలు సాగుతున్నాయనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. పరిశుభ్రత నిబంధనలను పూర్తిగా విస్మరించి, చెత్తాచెదారం మధ్యలోనే ఆహార పదార్థాలను తయారు చేసి ప్రజలకు విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.



చాలా దుకాణాల్లో వంట చేసే సిబ్బంది చేతులకు గ్లౌజులు ధరించకుండా, తగిన పరిశుభ్రత పాటించకుండా ఆహారాన్ని తయారు చేస్తున్నారు. ఒకసారి వాడిన వంట నూనెను మళ్లీ మళ్లీ ఉపయోగిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. నాణ్యత లేని నూనెలు, గడువు ముగిసిన పదార్థాలు, అధికంగా రసాయన ఫుడ్ కలర్స్ కలిపి ఆహారాన్ని ఆకర్షణీయంగా చూపించి విక్రయిస్తున్నట్లు కూడా విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఏజెన్సీ ప్రాంతంలో నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు, వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం ప్రజలకు నీటిని మరిగించి తాగాలని సూచిస్తున్నప్పటికీ, చాలా హోటళ్లలో తాగునీటి నాణ్యతపై ఎలాంటి శ్రద్ధ తీసుకోవడం లేదని, వేడి నీరు కూడా అందుబాటులో ఉంచడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోనే ఆహార భద్రత శాఖ కార్యాలయం ఉన్నప్పటికీ, ఇలాంటి ఉల్లంఘనలపై తనిఖీలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా? లేక అక్రమాలకు అండగా నిలుస్తున్నారా? అనే



సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం కంటే లాభాలకే ప్రాధాన్యం ఇస్తున్న వ్యాపారులపై కేసులు నమోదు చేసి, నాసిరకం ఆహారం విక్రయించే వారిపై భారీ జరిమానాలు విధించాలని, అవసరమైతే వారి లైసెన్సులు రద్దు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇంత ఘోరం కళ్ళముందు జరుగుతున్నా సంబంధిత అధికారులు ప్రజల ఆరోగ్యం కోసం గాని వాళ్ళ ప్రాణాల కోసం గాని పట్టించుకోవడం లేదనేది నేరుగా కనిపిస్తుంది కనుక జిల్లా అధికారులైన దీనిపై దృష్టి సారించి నిర్లక్ష్య ధోరణిగా వ్యవహరిస్తున్న అధికారులపై ప్రజల ప్రాణాలతో ఆటలాడుతూ వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలు కాపాడాలని పలువురు కోరారు.

# "బాబు ష్యూరిటీ-- భవిష్యత్తు గ్యారంటీ హామీల అమలుపై పెరుగుతున్న ప్రజల ఆందోళన.

### న్యాయం కోరుతున్నదరఖాస్తుదారులు"

నందిగామ, నిర్భయవార్త ప్రతినిధి :ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎన్నికల సమయంలో ప్రకటించిన "బాబు ష్యూరిటీ -- భవిష్యత్తు గ్యారంటీ" హామీలు ప్రస్తుతం మరోసారి ప్రజా చర్చకు దారితీస్తున్నాయి. తెలుగుదేశం పార్టీఆధ్వర్యంలో, నారా చంద్రబాబు నాయుడు మరియు నారా లోకేష్ నేతృత్వంలో ఈ హామీలు యువత, నిరుద్యోగులు, వృద్ధులు మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు భరోసా కలిగించే లక్ష్యంతో ఎన్నికల సమయంలోప్రకటించబడ్డాయి. ఈ పథకంలో ఉద్యోగ భరోసా, ఆర్థిక భరోసా,





గృహ భరోసా, పోషణ భరోసా వంటి అంశాలు ప్రజలకు పెద్ద ఆశలు కలిగించాయి. అనేక మంది దరఖాస్తుదారులు ఈహామీలపై నమ్మకంతో నమోదు చేసుకున్నట్లు చెబుతున్నారుఅయితే, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో, దరఖాస్తు చేసుకున్న వారిలో పెద్ద భాగానికి ఇంకా ప్రత్యక్ష ప్రయోజనాలు అందలేదని కొంతమంది వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా మధ్య వయస్సు (40--50) గల నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రధానంగా పెన్షన్ వ్యవస్థ కొనసాగుతున్నప్పటికీ, ఇతర "గ్యారంటీ" అంశాల అమలుపై స్పష్టత మరియు వేగవంతమైన చర్యలు అవసరమని దరఖాస్తుదారులు కోరుతున్నారు. వారు తమ దరఖాస్తుల పరిశీలన చేసి, ప్రతి ఒక్కరికీ హామీ ప్రకారంన్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల హామీలు అమలవడం పట్ల ఉన్న ఆశలు మరియు వాస్తవ పరిస్థితుల మధ్య ఉన్న వ్యత్యాసం మరోసారి రాజకీయ చర్చకు కేంద్రంగా మారింది.

# విద్య పేరుతో వసూళ్ల వేట..?.

### పుస్తకాల అమ్మకాల్లో ఇష్టారాజ్యమా..?

### నెల్లూరులో కార్పొరేట్ స్కూళ్లపై పెరుగుతున్న విమర్శలు




నెల్లూరు, నిర్భయవార్త ప్రతినిధి ;:.నెల్లూరు జిల్లాలో కొన్ని కార్పొరేట్ పాఠశాలల్లో పుస్తకాల విక్రయాల తీరుపై తల్లిదండ్రుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే భారీ ట్యూషన్ ఫీజులు, రవాణా ఛార్జీలు, యూనిఫాం, ఇతర ప్రత్యేక ఫీజులతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలపై ఇప్పుడు పుస్తకాల పేరుతో మరో భారీ ఆర్థిక భారం మోపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో సుమారు రూ. 5 వేలలో లభించే పుస్తకాల సెట్‌ను పాఠశాలల ద్వారానే కొనుగోలు చేయాలని సూచిస్తూ, రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బయట నుంచి పుస్తకాలు కొనుగోలు చేసే అవకాశాన్ని ఇవ్వకుండా ఒకే చోట కొనుగోలు చేయాలని ఒత్తిడి తీసుకొస్తున్నారని పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు. "విద్యను సేవగా అందించాలా... లేక వ్యాపారంగా మార్చాలా?" అనే ప్రశ్నలు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నుంచి వినిపిస్తున్నాయి. పుస్తకాల విక్రయాల్లో పారదర్శకత తీసుకురావాలని, అధిక ధరల వసూళ్లపై జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి, నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం చేయాలని ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

# పేరుకు మాత్రమే నీళ్ల ట్యాంకు విద్యార్థులకు తప్పని తిప్పలు.




బుడ్డారెడ్డిపల్లి మండలం, నిర్భయవార్త ప్రతినిధి :మండలం బుడ్డారెడ్డిపల్లి గ్రామంలోనీ ప్రాథమిక పాఠశాలకు మన ఊరి మనబడి కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు మంచినీళ్ల ట్యాంకు మంజూరు అయింది. పనులు కూడా పూర్తి కావడం జరిగింది. ప్రస్తుతం అక్కడ విద్యార్థిని విద్యార్థులకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదని విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. అక్కడ తాగునీటి అవసరాల కోసం కనీస వసతులైన కుళాయిలు ఏర్పాటు చేయలేదు. అలాగే సాతర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు 54 మంది విద్యార్థినిలు 37 మంది పాఠశాలలోవిద్యనుఅభ్యసించుచున్నారు. ఈ పాఠశాలలో రెగ్యులర్ టీచర్లు ముగ్గురు కాగా, డిప్యూటేషన్ పై నలుగురు టీచర్లు పనిచేస్తున్నారు. హిందీ టీచర్ పోస్టు ఖాళీగా ఉన్నదనీ ప్రధానోపాధ్యాయులు కిరణ్ కుమార్ మీడియాకు తెలియజేశారు. అలాగే మిగతా సబ్జెక్టుల వారు డిప్యుటేషన్ వై వివిధ గ్రామాల నుండి వచ్చి వారంలో రెండు రోజులు హిందీ సబ్జెక్టును బోధించడం జరుగుతుందనీ ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక ఉన్నత పాఠశాల నందు విద్యార్థిని విద్యార్థులకు త్రాగు నీటి బిందెలతో విద్యార్థులకు భోజనం అనంతరం గ్లాస్ లు, బాటిల్లతో నీళ్లు పోయడం జరుగుతుందని కనుక విద్యార్థులతీవ్ర ఇబ్బందిని దృష్టిలో పెటుకొని ఉన్నతాధికారులు చొరవ తీసుకొని విద్యార్థుల సమస్యను పరిష్కరించవలసిందిగా విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. దీనికంతటికీ కారణం ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థులతల్లిదండ్రుల ఆరోపిస్తున్నారు.



# ఆదేశంగా కాదు, అనునయంగా చెప్పండి!

పొద్దున్నే నిద్రలేవాలి... బ్రష్ చేయాలి... టిఫిన్ తినాలి... సమయానికి స్కూల్‌కు వెళ్లాలి... హోంవర్క్ పూర్తి చేయాలి... ఫోన్ ఎక్కువసేపు చూడకూడదు... రాత్రి త్వరగా పడుకోవాలి... ఇలా ప్రతి ఇంట్లో రోజూ వినిపించే మాటలే పిల్లలకు పెద్ద తలనొప్పిగా అనిపిస్తుంటాయి. ఒకటే మాట పదేపదే చెబుతుండటంతో విసుగు, చిరాకు, కొన్నిసార్లు మొండితనం కూడా పెరుగుతుంది. చాలామంది తల్లిదండ్రులు మాత్రం "మమ్మల్ని మా పెద్దలు ఇలాగే పెంచారు... ఇప్పుడు మేం కూడా అలాగే పెంచాలి" అనే భావనతో పిల్లల వెంట పడుతూనే ఉంటారు. కానీ కాలం మారింది. పిల్లల ఆలోచనా విధానం, ప్రశ్నించే స్వభావం, ప్రపంచాన్ని అర్థం చేసుకునే తీరు కూడా మారిపోయింది. అందుకే ఆదేశాలు, హెచ్చరికలు, శిక్షలతో క్రమశిక్షణ నేర్పే రోజులు దాదాపుగా ముగిశాయని మనస్తత్వ నిపుణులు చెబుతున్నారు. పిల్లలకు ఏ నియమమైనా పాటించమని చెప్పేముందు, అది ఎందుకు అవసరమో అర్థమయ్యేలా వివరించినప్పుడే వారు దాన్ని మనస్ఫూర్తిగా అంగీకరిస్తారని పరిశోధనలు సూచిస్తున్నాయి.



### ప్రేమతో మార్పు

పిల్లలు ఒకసారి చెప్పగానే వినకపోవడం సహజం. అలాంటి సమయంలో కోపం, దండన, బెదిరింపులు ఆశ్రయించడం కంటే, ప్రేమగా మాట్లాడి వారి సందేహాలను తీర్చడం ఎంతో ప్రభావవంతమని మనస్తత్వవేత్తలు సూచిస్తున్నారు. కుటుంబ నియమాల వెనుక ఉన్న ఉద్దేశాన్ని పిల్లలకు వివరించడం, వారి ప్రశ్నలకు ఓపికగా సమాధానం చెప్పడం, చిన్నచిన్న నిర్ణయాల్లో వారికీ అవకాశం ఇవ్వడం వల్ల వారు ఆ నియమాలను తమ జీవితంలో భాగంగా స్వీకరిస్తారు. ప్రముఖ మనస్తత్వవేత్తలు ఎడ్వర్డ్ ఎల్. డెసి, రిచర్డ్ ఎం. ర్యాన్ ప్రతిపాదించిన స్వీయ నిర్ణయ సిద్ధాంతం కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. పిల్లలకు స్వయంగా ఆలోచించే అవకాశం, కుటుంబ సభ్యులతో ఆత్మీయ అనుబంధం, తమ వల్ల పనులు చేయగలమనే నమ్మకం లభించినప్పుడు వారు సహజంగానే బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తారు. శిక్ష భయంతో కాకుండా, తమ మంచికోసమే ఈ నియమాలని అర్థం చేసుకున్న పిల్లలు వాటిని స్వయంగా పాటించడం ప్రారంభిస్తారు. తల్లిదండ్రులు ప్రతి క్షణం గుర్తు చేయాల్సిన అవసరం కూడా తగ్గిపోతుంది. ప్రేమతో ఇచ్చే వివరణ పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా భావోద్వేగ నియంత్రణను కూడా బలోపేతం చేస్తుందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

### పిల్లల మాట

కుటుంబ నియమాలు పెద్దలు రూపొందించినా, వాటిని పాటించాల్సింది పిల్లలే. అందుకే పిల్లలు ఏమనుకుంటున్నారు, వారికి ఏం ఇబ్బందిగా అనిపిస్తోంది, ఏ నియమం ఎందుకు నచ్చడం లేదనే విషయాలను తెలుసుకోవడం కూడా అంతే అవసరం! పిల్లల మాట పూర్తిగా వినకుండా తమ అధికారాన్ని ప్రదర్శించడం వల్ల దూరం పెరుగుతుంది. అదే వారి భావాలను గౌరవించి, తమ నిర్ణయాల వెనుక ఉన్న ఉద్దేశాన్ని ప్రశాంతంగా వివరించినప్పుడు కుటుంబంలో పరస్పర నమ్మకం పెరుగుతుంది. తల్లిదండ్రులు తమను నియంత్రించడం కోసం కాకుండా, తమ శ్రేయస్సు కోసమే సూచనలు చేస్తున్నారని పిల్లలు అర్థం చేసుకుంటారు. అప్పుడు ఎదురుతిరగడం, మొండితనం వంటి ప్రవర్తనలు క్రమంగా తగ్గుతాయి. భయంతో పెరిగిన పిల్లలు అవకాశం దొరికితే నియమాలను అతిక్రమించే అవకాశం ఎక్కువగా ఉంటే, అవగాహనతో పెరిగిన పిల్లలు మాత్రం జీవితంలో ఎక్కడ ఉన్నా బాధ్యతాయుతంగా నిర్ణయాలు తీసుకుంటారు. అందుకే పిల్లలకు నియమాలు నేర్పడం కంటే, ఆ నియమాల వెనుక ఉన్న జీవిత పాఠాన్ని నేర్పడం తల్లిదండ్రుల అసలైన బాధ్యతగా నిపుణులు సూచిస్తున్నారు.

# మీ అల్పాహారం బలవర్ధకమేనా?



ఉదయం తీసుకునే అల్పాహారం రోజంతా శరీరానికి శక్తినిచ్చే తొలి ఆహారం. అందుకే అది కేవలం కడుపు నింపేదిగా కాకుండా, శరీరానికి అవసరమైన పోషకాలను అందించేదిగా ఉండాలి. మన తెలుగు వారి సంప్రదాయ అల్పాహారాలైన ఇడ్లీ, దోసె, ఉప్మా, పూరీ వంటివి ప్రధానంగా కార్బోహైడ్రేట్లతో కూడి ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందించినప్పటికీ త్వరగా జీర్ణమవుతాయి. దీంతో కొద్దిసేపటికే మళ్లీ ఆకలి వేయడం, మధ్యాహ్నానికి ముందే నీరసం, అలసట అనిపించడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అందుకే పోషకాహార నిపుణులు ఉదయపు టిఫిన్‌లో చిన్న మార్పు చేయాలని సూచిస్తున్నారు. టిఫిన్‌ను మార్చాల్సిన అవసరం లేదు. దానికి ప్రోటీన్‌ను జోడిస్తే సరిపోతుంది.

### ప్రోటీన్ అవసరం

ప్రోటీన్ శరీరంలో కండరాల నిర్మాణానికి, కణాల మరమ్మతుకు, ఎంజైమ్‌లు, హార్మోన్ల తయారీకి అత్యంత అవసరమైన పోషకం. కార్బోహైడ్రేట్లతో పోలిస్తే ఇది నెమ్మదిగా జీర్ణమవుతుంది. అందువల్ల ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగి, తరచూ ఆకలి వేయకుండా చేస్తుంది. అలాగే రక్తంలో చక్కెర స్థాయులు ఒక్కసారిగా పెరగకుండా సహాయపడుతుంది. ముఖ్యంగా నలభై ఏళ్ల తర్వాత సహజంగానే కండరాల బలం తగ్గడం ప్రారంభమవుతుంది. ఈ మార్పును తగ్గించడానికి ప్రతిరోజూ తగిన మోతాదులో ప్రోటీన్ తీసుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు, యువత, ఉద్యోగులు, వృద్ధులు ఇలా ప్రతి వయసు వారికి కూడా ఉదయపు అల్పాహారంలో ప్రోటీన్ ఉండటం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

### చిన్న మార్పు చేయండి!

సంప్రదాయ అల్పాహారాన్ని పూర్తిగా మార్చాల్సిన అవసరం లేదు. ఇడ్లీ, దోసె లేదా ఉప్మాతో పాటు ఒకటి లేదా రెండు ఉడకబెట్టిన గుడ్లు, పప్పుతో చేసిన సాంబారు, పల్లీల చట్నీ, పెరుగు, మొలకెత్తిన శనగలు, పెసలు వంటి ప్రోటీన్ ఎక్కువగా ఉండే పదార్థాలను చేర్చడం ద్వారా అల్పాహారం మరింత సమతుల్యంగా మారుతుంది. దీంతో శరీరానికి వెంటనే కావాల్సిన శక్తితో పాటు ఎక్కువసేపు నిలిచే శక్తి కూడా లభిస్తుంది. మధ్యలో చిరుతిళ్లపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లలో పెద్ద మార్పులు చేయడం కంటే, రోజూ తినే టిఫిన్‌లో ఇలాంటి చిన్న మార్పులు చేయడం సులభమే కాదు, దీర్ఘకాలిక ఆరోగ్యానికి కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

# జుట్టు రాలడాన్ని స్వీకరిస్తూ గుండుతో ఉండేందుకే ప్రాధాన్యత ఇస్తున్న యువత.. మారుతున్న ట్రెండ్..

పురుషుల్లో జుట్టు రాలే సమస్య చాలా కాలంగా ఆందోళనకు కారణమవుతోంది. జుట్టు ఊడిపోకుండా ఉండేందుకు మందులు, సప్లిమెంట్లు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్లు, ఇతర చికిత్సలపై ఆధార పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. అయితే ఇప్పుడు మరో కొత్త ధోరణి వేగంగా ప్రాచుర్యం పొందుతోంది. జుట్టు రాలడాన్ని దాచిపెట్టడం లేదా దానితో పోరాడడం కంటే, పూర్తిగా గుండు చేయించుకుని ఆ రూపాన్ని ఆత్మవిశ్వాసంతో స్వీకరించే బాల్డ్‌మ్యాక్సింగ్ ట్రెండ్‌కు యువతలో ఆదరణ పెరుగుతోంది. సోషల్ మీడియా వేదికలపై గుండు రూపాన్ని స్వీకరించిన పురుషులు తమ అనుభవాలను పంచుకుంటూ ఒకరికొకరు ప్రోత్సాహం అందిస్తున్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ కమ్యూనిటీల్లో హెయిర్‌లైన్ గురించి ఆందోళన పడకుండా సహజమైన రూపాన్ని అంగీకరించాలని ప్రోత్సహిస్తున్నారు. గుండు చేయించుకున్న తర్వాత మానసిక ఒత్తిడి తగ్గి, తమను తాము స్వీకరించే భావన పెరిగిందని పలువురు చెబుతున్నారు.



**ఆత్మ విశ్వాసానికి మార్గం..**

జుట్టు రాలడాన్ని ఒక సమస్యగా భావించి దాన్ని దాచిపెట్టేందుకు ప్రయత్నించే బదులు, స్వయంగా నిర్ణయం తీసుకుని గుండు చేయించుకోవడం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని ఈ ఉద్యమానికి మద్దతుదారులు అంటున్నారు. జుట్టు రాలడం తమ నియంత్రణలో లేని విషయం కాబట్టి, దాన్ని అంగీకరించడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తోందని వారు చెబుతున్నారు. జుట్టు రాలడాన్ని నివారించే చికిత్సల మార్కెట్ ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోంది. ఫినాస్టెరైడ్, మినాక్సిడిల్ వంటి మందులు కొంతమందిలో ప్రయోజనం చూపించినప్పటికీ, వాటిని దీర్ఘకాలం ఉపయోగించాల్సి ఉంటుంది. అంతేకాకుండా ప్రతి ఒక్కరిలో ఒకే విధమైన ఫలితాలు రావని నిపుణులు చెబుతున్నారు. కొంతమందిలో లైంగిక ఆసక్తి తగ్గడం, మానసిక స్థితిలో మార్పులు వంటి దుష్ప్రభావాలు కూడా కనిపించే అవకాశం ఉందని సూచిస్తున్నారు. అలాగే హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్లు, ఇతర ఆధునిక చికిత్సలు ఖరీదైనవిగా మారుతున్నాయి.

**అంగీకరిస్తున్న యువత..**

ఇలాంటి పరిస్థితుల్లో చాలామంది సహజంగా జుట్టు రాలడాన్ని అంగీకరించాలని నిర్ణయించుకుంటున్నారు. గుండు చేయించుకున్న తర్వాత తమపై ఉన్న ఆందోళన తగ్గిపోయిందని, ప్రతిరోజూ అద్దం ముందు నిలబడి జుట్టు గురించి ఆలోచించాల్సిన అవసరం లేకుండా పోయిందని పలువురు చెబుతున్నారు. సోషల్ మీడియాలో గుండు చేయించుకునే ముందు, తర్వాత తీసిన ఫొటోలు విస్తృతంగా పంచుకుంటున్నారు. వాటిలో చాలామంది కొత్త లుక్‌తో మరింత ఆత్మవిశ్వాసంగా కనిపిస్తున్నారని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. కొందరు గడ్డం పెంచుకుని కొత్త స్టైల్‌ను ఎంచుకుంటుండగా, మరికొందరు ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి తమ వ్యక్తిత్వాన్ని మరింత మెరుగుపరుచుకుంటున్నారు. బార్బర్‌ల అభిప్రాయం ప్రకారం కూడా గత కొన్నేళ్లలో గుండు లేదా బజ్‌కట్ చేయించుకునే పురుషుల సంఖ్య పెరిగింది. పలుచగా కనిపించే జుట్టుతో ఉండటం కంటే పూర్తిగా గుండు చేయించుకోవడం కొందరిని మరింత యవ్వనంగా కనిపించేలా చేస్తుందని వారు చెబుతున్నారు. హాలీవుడ్‌లో గుండు రూపంతోనే విజయవంతమైన ప్రముఖ నటులు ఉండటం కూడా ఈ ధోరణికి ప్రోత్సాహం ఇస్తోంది.

**జీవితంపై సానుకూల దృక్పథం..**

గుండు చేయించుకోవడం కేవలం రూపంలో మార్పు మాత్రమే కాదని, అది జీవితంపై సానుకూల దృక్పథాన్ని కూడా పెంచుతుందని ఈ ట్రెండ్‌ను అనుసరిస్తున్నవారు చెబుతున్నారు. ఈ నిర్ణయం తీసుకున్న తర్వాత కొందరు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం, వ్యాయామం ప్రారంభించడం, ఉద్యోగంలో కొత్త అవకాశాల కోసం ముందుకు రావడం, వ్యక్తిగత జీవితంలో ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవడం వంటి మార్పులు చోటుచేసుకున్నాయని పంచుకుంటున్నారు.

# కిడ్నీ బాధితులు బీట్‌రూట్ తినొచ్చా?

మధుమేహం, అధిక రక్తపోటు, మారిన జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల కారణంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా బీట్‌రూట్ కిడ్నీ రోగులకు మంచిదా? లేక హానికరమా? అనే సందేహానికి నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం..




**కిడ్నీ బాధితులు బీట్‌రూట్ తినొచ్చా?**

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డయాబెటిస్ అండ్ డైజెస్టివ్ అండ్ కిడ్నీ డిసీజెస్ (చీ×ణణఖ) ప్రకారం.. కాల్షియం ఆక్సలేట్ రాళ్లు వచ్చే ప్రమాదం ఉన్నవారు ఆక్సలేట్ ఎక్కువగా ఉండే ఆహారాలను పరిమితంగా తీసుకోవాలి. బీట్‌రూట్ కూడా అలాంటి ఆహారాల్లో ఒకటి. అయితే, కిడ్నీ బాధితులు బీట్‌రూట్‌ను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. కాల్షియం ఆక్సలేట్ రాళ్ల సమస్య లేకపోతే.. వైద్యులు లేదా డైటీషియన్ సలహా మేరకు పరిమిత మోతాదులో బీట్‌రూట్ తీసుకోవచ్చు. అంటే, బీట్‌రూట్ తినాలా వద్దా అనేది మీకు ఉన్న కిడ్నీ సమస్య రకాన్ని బట్టి నిర్ణయించాలి. వైద్యుల సలహా లేకుండా ఆహారంలో పెద్ద మార్పులు చేయకపోవడం మంచిది.

**ఏ ఆహారాలకు దూరంగా ఉండాలి?**

కాల్షియం ఆక్సలేట్ రాళ్లు వచ్చే ప్రమాదం ఉన్నవారు ఈ ఆహారాలను పరిమితంగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

పాలకూర బీట్‌రూట్ బాదం వేరుశెనగ చాక్లెట్  అధిక ఉప్పు ప్రాసెస్ చేసిన ఆహారాలు ప్యాక్ చేసిన స్నాక్స్ చక్కెర ఎక్కువగా ఉండే పానీయాలు వీటిని కూడా తగ్గించడం మంచిది.

**కిడ్నీ బాధితులు ఏం తినాలి?**

కిడ్నీ సమస్యలు ఉన్నవారు వైద్యులు లేదా పోషకాహార నిపుణులు సూచించిన ఆహారాన్నే పాటించాలి. సాధారణంగా, తగినంత నీరు తాగడం, తాజా పండ్లు, తక్కువ ఆక్సలేట్ ఉన్న కూరగాయలు, తృణధాన్యాలు, అవసరమైన మోతాదులో ప్రోటీన్ తీసుకోవడం మంచిది. అలాగే ఉప్పు వినియోగాన్ని తగ్గించి, ప్యాక్ చేసిన, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండాలి. వైద్యుల సూచనల మేరకు ఆహారం తీసుకోవడమే కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఉత్తమ మార్గం.




## గ్లామర్‌తో కట్టేసిన నిధి అగర్వాల్:

ఫ్లాపుల్లోనూ తగ్గని 'ఇస్మార్ట్' క్రేజ్ ఈ యంగ్ బ్యూటీ ఫోటోలను షేర్ చేసిన కేవలం 4 గంటల వ్యవధిలోనే లైకులు, కామెంట్ల వర్షం కురుస్తోంది. ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ సోషల్ మీడియాలో నిరంతరం యాక్టివ్‌గా ఉంటూ తన గ్లామరస్ ఫోటోలతో అభిమానులను అలరిస్తూనే ఉంటుంది. తాజాగా ఈ భామ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన బ్లాక్ అవుట్‌ఫిట్ ఫోటోలు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. నలుపు రంగు దుస్తులలో నిధి ఒలకబోసిన అందాలు.. తన ఇంటెన్స్ లుక్స్ కుర్రకారు గుండెల్లో మంటలు రేపుతున్నాయి. ఈ లేటెస్ట్ గ్లామర్ ఫోటోలతో నిధి అగర్వాల్ మరోసారి సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. ఈ యంగ్ బ్యూటీ ఫోటోలను షేర్ చేసిన కేవలం 4 గంటల వ్యవధిలోనే లైకులు, కామెంట్ల వర్షం కురుస్తోంది. నిధి అందానికి ఫిదా అయిన నెటిజన్లు, అభిమానులు హార్ట్- బ్లాక్ హార్ట్- ఫైర్ ఎమోజీలతో కామెంట్ సెక్షన్‌ను పూర్తిగా నింపేస్తున్నారు. జార్జియస్ (అద్భుతంగా ఉన్నావు), -బ్యూటిఫుల్ బ్లాక్ క్వీన్- అంటూ నెటిజన్లు నిధి రూపానికి మురిసిపోతూ రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు. దీంతో ఈ ఫోటోలు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్‌పై క్షణాల్లో వైరల్‌గా మారాయి. నిజానికి నిధి అగర్వాల్ కెరీర్ పరంగా ఇటీవల కాలం పెద్దగా కలిసిరాలేదనే చెప్పాలి. టాలీవుడ్ మోస్ట్ అవేటెడ్ పీరియాడిక్ డ్రామా.. పవన్ కళ్యాణ్ సరసన నటించిన ప్రతిష్టాత్మక చిత్రం -హరి హర వీర మల్లు-తో పాటు.. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన -రాజా సాబ్- చిత్రాల్లో నిధి కథానాయికగా మెరిసింది. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఈ రెండు భారీ బడ్జెట్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయాన్ని చవిచూసి.. ఈ ఏడాది బిగ్గెస్ట్ ఫ్లాపులుగా నిలిచాయి. అయితే బాక్సాఫీస్ వద్ద వరుసగా రెండు భారీ డిజాస్టర్లు పడినప్పటికీ నిధి అగర్వాల్ కెరీర్‌కు మాత్రం ఎలాంటి డోఖా లేదని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. సాధారణంగా స్టార్ హీరోల సినిమాల ఫ్లాప్ ఎఫెక్ట్ హీరోయిన్లపై పడుతుంది.. కానీ నిధి విషయంలో మాత్రం అది రివర్స్ అయింది. గ్లామర్ ప్రపంచంలో తనకున్న క్రేజ్, యూత్ ఫాలోయింగ్ కారణంగా ఇప్పటికీ పలు నిర్మాణ సంస్థలు, దర్శకులు తన వైపు మొగ్గు చూపుతున్నారు. సినిమాల ఫలితాలతో సంబంధం లేకుండా నిధి బ్రాండ్ వాల్యూ అలాగే స్థిరంగా కొనసాగుతోంది. ఇక 2026-27 సీజన్‌లో నిధి అగర్వాల్ తదుపరి ప్రాజెక్టుల విషయానికి వస్తే.. ఈ బ్యూటీ ప్రస్తుతం చాలా ఆచితూచి అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు అందుతున్న సమాచారం ప్రకారం.. భారీ డిజాస్టర్ల తర్వాత కొత్తగా ఏ తెలుగు సినిమాకు లేదా వెబ్ సిరీస్‌లకు అధికారికంగా సంతకాలు చేయలేదు.




## కేతిక శర్మకు బాలీవుడ్‌లోను బిగ్ ధమాల్

ఇక కేతిక శర్మ టాలీవుడ్ కెరీర్ విషయానికి వస్తే.. పూరి జగన్నాథ్ కొడుకు ఆకాష్ పూరి సరసన -రొమాంటిక్- చిత్రంతో తెలుగు ఇండస్ట్రీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ఢిల్లీ బ్యూటీ కేతిక శర్మ టాలీవుడ్‌లో తన గ్లామర్‌తో కుర్రకారును ఆకట్టుకున్నా ఆశించిన స్థాయిలో స్టార్ డమ్‌ను మాత్రం అందుకోలేకపోయింది. ఈ క్రమంలోనే బాలీవుడ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భారీ ఆశలతో హిందీ చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టింది. బాలీవుడ్ మోస్ట్ సక్సెస్‌ఫుల్ కామెడీ ఫ్రాంచైజీలో భాగంగా వచ్చిన -ధమాల్ 4- చిత్రంలో కేతికకు ఒక మంచి అవకాశం దక్కింది. అయితే తాజాగా విడుదలైన ఈ సినిమా మిశ్రమ స్పందనలతో ప్రజలు పెదవి విరిచేయడం కేతికను నిరాశపరిచింది. ఫ్లాపుల్లోనూ తగ్గని 'ఇస్మార్ట్' క్రేజ్ హిందీ ప్రేక్షకుల ముందుకు వచ్చిన -ధమాల్ 4- చిత్రానికి యావరేజ్ రివ్యూలు వచ్చాయి. ఫస్టాఫ్‌లో వచ్చే కొన్ని కామెడీ సీన్లు కుటుంబ ప్రేక్షకులను అలరించినా.. సెకండాఫ్ కి వచ్చేసరికి స్క్రీన్‌ప్లే పూర్తిగా పట్టు కోల్పోయిందని.. సినిమా చాలా ఫ్లాట్‌గా ముగిసిందని విమర్శలు వచ్చాయి. ధమాల్ ఫ్రాంచైజీకి ఉండే అసలైన క్రేజీ.. మ్యాడ్‌నెస్- కామెడీ ఇందులో లోపించిందని ట్రేడ్ వర్గాలు తేల్చేశాయి. లీడ్ యాక్టర్స్ అందరూ బాగానే నటించినా.. బలహీనమైన కథనం కారణంగా కేతిక శర్మ పెట్టుకున్న బాలీవుడ్ ఆశలపై ఈ సినిమా నీళ్లు చల్లింది. ఇక కేతిక శర్మ టాలీవుడ్ కెరీర్ విషయానికి వస్తే.. పూరి జగన్నాథ్ కొడుకు ఆకాష్ పూరి సరసన -రొమాంటిక్- చిత్రంతో తెలుగు ఇండస్ట్రీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. తన బోల్డ్ లుక్స్‌తో మెప్పించిన ఈ భామ ఆ తర్వాత నాగశౌర్య సరసన -లక్ష్య-, మెగా హీరో సాయి ధరమ్ తేజ్ సరసన -రంగ రంగ వైభవంగా-, ఉస్తాద్ రామ్ పోతినేని సరసన -బ్రో- చిత్రంలోనూ మెరిసింది. ఇలా వరుసగా యువ హీరోలతో జతకట్టినా.. ఈ సినిమాలేవీ బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపించలేకపోయాయి. వరుస పరాజయాల కారణంగా కేతికకు ఇటీవలి కాలంలో తెలుగు చిత్ర పరిశ్రమలో కొత్త అవకాశాలు బాగా తగ్గిపోయాయి. టాలీవుడ్ మేకర్స్ ఈ బ్యూటీ వైపు పెద్దగా మొగ్గు చూపకపోవడంతో కేతిక తన రూట్ మార్చక తప్పలేదు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం పొరుగు పరిశ్రమ కోలీవుడ్ (తమిళం) పైనా దృష్టి సారించింది. తెలుగులో బ్రేక్ దక్కకపోయినా.. తమిళ తంబీలను అలరించి అక్కడైనా తన లక్‌ను మార్చుకోవాలని ఈ గ్లామర్ బ్యూటీ గట్టిగా ప్రయత్నిస్తోంది. 2026-27 సీజన్‌లో కేతిక శర్మ నటించిన చిత్రాలు కొన్ని విడుదలకు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా తమిళంలో హిప్ హాప్ థమిజ సరసన బ్లాక్‌బస్టర్ సీక్వెల్ -మీసయ్య మురుక్కు 2- లో నటిస్తోంది. దీంతో పాటు -లైలా- అనే మరో తమిళ క్రేజీ ప్రాజెక్ట్‌లోనూ భాగమైంది. అలాగే ప్రముఖ దర్శకుడు రాజేష్ ఎమ్ సెల్వ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఒక భారీ యాక్షన్ థ్రిల్లర్ మూవీలోను ప్రస్తుతం కేతిక షూటింగ్‌లో పాల్గొంటోంది. మునుముందు ఈ వరుస తమిళ చిత్రాలైనా కేతిక శర్మ కెరీర్‌కు బిగ్ బ్రేక్ ఇస్తాయేమో వేచి చూడాలి.



## మహేష్ గ్లోబల్ జర్నీ తో టాలీవుడ్ మరో మెట్టు పైకి!



ఇలాంటి క్రమశిక్షణతో కూడిన ప్రయాణం భవిష్యత్తులో మరింత మంది స్టార్ హీరోలు అంతర్జాతీయ వేదికలపై స్థిరపడటానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. తెలుగు చిత్రసీమ దశాబ్దాలుగా ఎన్నో మార్పులకు లోనవుతున్నా? ప్రస్తుత తరుణంలో సూపర్ స్టార్ మహేష్ చేపట్టిన గ్లోబల్ జర్నీ టాలీవుడ్ స్థాయిని మరో మెట్టు పైకి ఎక్కిస్తుందన్నది కాదనలేని నిజం. ఒక ప్రాంతీయ స్టార్‌గా కాకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సినిమాలను ఎంచుకోవడం ద్వారా మహేష్ పరిశ్రమ గమనాన్ని మారుస్తున్నారు. రాజమౌళి - మహేష్ కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న గ్లోబల్ ప్రాజెక్ట్ -వారణాసి- ప్రపంచ సినిమా పటంలో తెలుగు సినిమాకు ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తుంది. మహేష్ లో ఉన్న సహజ సిద్ధమైన హాలీవుడ్ స్టార్ ఫీచర్స్ అదనపు బలాన్ని ఇస్తున్నాయి. ఫ్లాపుల్లోనూ తగ్గని 'ఇస్మార్ట్' క్రేజ్ ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ యాక్షన్ హీరోగా మాత్రమే కాకుండా ప్రపంచ స్థాయి నటుడిగా కనిపించే పరిణతి, గ్లోబల్ ఆడియెన్స్‌ను ఆకట్టుకోవడానికి ప్లస్‌గా మారుతున్నాయి. మహేష్ బాడీ లాంగ్వేజ్, ఫ్యాషన్ సెన్స్ కెమెరా ముందు ప్రదర్శించే హావభావాలు హాలీవుడ్ సినిమాల్లో కనిపించే స్థాయి నటనకు ఏమాత్రం తక్కువ కాదని చెప్పొచ్చు. ముఖ్యంగా జర్మనీ వంటి దేశాల్లో కఠినమైన శిక్షణ తీసుకోవడం, సినిమా కోసం తనను తాను పూర్తిగా మార్చుకోవడం వంటివి మహేష్ అంకితభావాన్ని చాటుతున్నాయి. నటుడిగా తన పరిధిని విస్తరించుకోవాలని మహేష్ చేస్తున్న ప్రయత్నం టాలీవుడ్ లో మిగతా స్టార్ హీరోలకు కూడా ఓ కొత్త దారిని చూపి స్తోంది. ఇలాంటి క్రమశిక్షణతో కూడిన ప్రయాణం భవిష్యత్తులో మరింత మంది స్టార్ హీరోలు అంతర్జాతీయ వేదికలపై స్థిరపడటానికి మార్గదర్శకంగా నిలుస్తుంది. గ్లోబల్ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని సినిమాలు రూపొందించడం తో టాలీవుడ్ సినిమాల బడ్జెట్ .. సాంకేతిక ప్రమాణాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. మహేష్ ఎంచుకుంటున్న కథాంశాలు కేవలం ఒక వర్గానికి పరిమితం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు ఆకట్టుకునేలా ఉంటున్నాయి. ఇది తెలుగు నిర్మాతలు, దర్శకులు , సాంకేతిక నిపుణులకు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకోవడానికి గొప్ప వేదికను అందిస్తోంది. ఈ మార్పు తో టాలీవుడ్ చిత్రాలకు దక్కుతున్న ఆదరణ బాక్సాఫీస్ వసూళ్లను మాత్రమే కాకుండా పరిశ్రమ గౌరవాన్ని కూడా పెంచుతోంది. గ్లోబల్ స్థాయిలో తెలుగు సినిమాలకి వస్తున్న గుర్తింపు భారతీయ సినిమా వైపు ప్రపంచం చూసేలా చేస్తోంది. మహేష్ లాంటి గ్లోబల్ ఐకాన్ లీడ్‌లో ఉండటం వల్ల అంతర్జాతీయ పంపిణీదారులు .. థియేటర్ల యజమానులు చిత్రాలను ప్రదర్శించడానికి ముందుకొస్తున్నారు. -వారణాసి- ప్రపంచ వ్యాప్తంగా 120 దేశాల్లో విడుదల చేస్తోన్న తీరు..రాజమౌళి గ్లోబల్ ఇమేజ్ తోనే ఇదంతా సాధ్యమవుతుంది. చివరిగా మహేష్ గ్లోబల్ జర్నీ టాలీవుడ్ కు కొత్త శకాన్ని పరిచయం చేస్తోంది. ఆయనలోని స్టార్ ఫీచర్స్ , ప్రపంచ స్థాయి కథాంశాల కలయిక తెలుగు సినిమాను గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద విజేతలుగా నిలబెడుతుంది. రాబోయే రోజుల్లో మహేష్ ప్రాజెక్టులు తెలుగు సినిమా స్థాయిని ఎలా? అంతర్జాతీయ శిఖరాలకు చేరుస్తాయో వేచి చూడాలి.

## 'జై హనుమాన్' పై గ్రౌండ్ రియాలిటీ..!

ఇప్పుడు పాన్ ఇండియా లెవెల్లో వస్తున్న దాదాపు సీక్వెల్ సినిమాల్లో మన తెలుగు సినిమా నుంచే దాదాపుగా కనిపిస్తూ ఉంటాయి. అయితే ఈ చిత్రాల్లో ఓ అవైటెడ్ సీక్వెల్ సినిమా "జై హనుమాన్" కూడా ఒకటి. యువ దర్శకుడు ప్రశాంత్ వర్మని టాలీవుడ్ లో స్టార్ దర్శకుల్లో ఒకరిగా ఈ సినిమా మార్చేసింది. యువ హీరో తేజ సజ్జ, కన్నడ స్టార్ నటుడు రిషబ్ శెట్టి కలయిక లో అత్యంత భారీగా తెరకెక్కిస్తున్నారు ఈ సినిమాని. అయితే పార్ట్ 2 ని ప్రశాంత్ 2025 లోనే ప్రామిస్ చేసాడు కానీ ఆల్రెడీ 2026 కూడా సగం అయ్యిపోయింది. ఇప్పటికీ ఎలాంటి అప్డేట్ తెలియడం లేదు. అయితే ఆఫ్ లైన్ లో బజ్ ని పక్కన పెడితే రీసెంట్ మా ప్రోగ్రెస్ లో గ్రౌండ్ రియాలిటీలో మాత్రం 'జై హనుమాన్' కోసం ఎదురు చూస్తున్నవారు బాగానే ఉన్నారు. పార్ట్ 1 సెన్సేషనల్ హిట్ కావడంతో పార్ట్ 2 ఎప్పుడు వస్తుందా అని రిలీజ్ కోసం క్లారిటీ కోరుకుంటున్నారు. సో ఆఫ్ లైన్ లో మాత్రం జై హనుమాన్ క్రేజ్ పదిలంగానే ఉందని చెప్పొచ్చు. కానీ మేకర్స్ కూడా ఎప్పటికప్పుడు సినిమా కోసం ఓ క్లారిటీ ఇస్తే బాగుంటుంది.




## యూఎస్ మార్కెట్ లో 'లెనిన్' కి సాలిడ్ ఓపెనింగ్స్!




అఖిల్ అక్కినేని హీరోగా యువ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ హా దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కించిన లేటెస్ట్ సినిమానే 'లెనిన్'. ఎప్పుడో మొదలైనప్పటికీ ఇంత లేట్ గా వచ్చినా కూడా మేకర్స్ మంచి ఫలితాన్ని ఆడియెన్స్ నుంచి అందుకున్నారు. ఇక ఇదిలా ఉండగా లెనిన్ వసూళ్ల పరంగా కూడా స్ట్రాంగ్ గా నిలబడ్డాడు అని చెప్పవచ్చు. మెయిన్ గా యూఎస్ మార్కెట్ నార్త్ అమెరికాలో ఈ సినిమాకి మంచి ఓపెనింగ్స్ దక్కడం విశేషం. అక్కడ ప్రీమియర్స్ డే కి కలిపి 2 లక్షల 50 వేల డాలర్స్ మార్క్ దాటి ఇపుడు 3 లక్షల మార్క్ దిశగా లెనిన్ వెళుతున్నాడు. ఇక వీకెండ్ కి ఈజీగా హాఫ్ మిలియన్ మార్క్ ని దాటేసి 1 మిలియన్ దగ్గరకి వెళ్లినా ఎలాంటి ఆశ్చర్యం లేదు. సో మొత్తానికి అఖిల్ మాత్రం చాలా కాలం గ్యాప్ తర్వాత వచ్చినప్పటికీ సాలిడ్ ఓపెనింగ్స్ సొంతం చేసుకున్నాడని చెప్పవచ్చు.

## పదేళ్ల కష్టానికి ఫలితం వస్తుందా?

'లెనిన్'తో అఖిల్ సక్సెస్ అందుకున్నాడా ? టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి పదేళ్లు దాటుతున్నా ఒక సాలిడ్ హిట్ కోసం వెయిట్ చేస్తున్న అక్కినేని యంగ్ హీరో అఖిల్.. తాజాగా 'లెనిన్' సినిమాతో ఈరోజు ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి పదేళ్లు దాటుతున్నా ఒక సాలిడ్ హిట్ కోసం వెయిట్ చేస్తున్న అక్కినేని యంగ్ హీరో అఖిల్.. తాజాగా 'లెనిన్' సినిమాతో ఈరోజు ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ పల్లెటూరి డ్రామా నేడు థియేటర్లలో విడుదలైంది. మరి ఈ సినిమాతోనైనా అఖిల్ కోరుకున్న బ్రేక్ వచ్చిందా? ఈ చిత్రంలో అక్కినేని కుర్రాడి నటన, గెటప్ ఎలా ఉన్నాయి? అసలు విశేషాలు చూద్దాం.. భారతం మిట్ట.. లెనిన్ కథేంటి? ఫ్లాపుల్లోనూ తగ్గని 'ఇస్మార్ట్' క్రేజ్ చిత్తూరు జిల్లాలోని 'భారతం మిట్ట' అనే ఊరి నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. అక్కడ అనాథగా ఉన్న లెనిన్ (అఖిల్)ను వసంత్ (ప్రమోద్) అనే వ్యక్తి చేరదీసి తన సొంత తమ్ముడిలా పెంచుతాడు. ఊరిలో అందరికీ తలలో నాలుకలా ఉండే లెనిన్, భారతి (భాగ్యశ్రీ బోర్సే) అనే అమ్మాయిని ప్రేమిస్తాడు. కానీ అనూహ్యంగా భారతిని వసంత్ పెళ్లి చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. అప్పుడు లెనిన్ ఏం చేశాడు? ఆ ఊరిలో ఎలాంటి గొడవలు జరిగాయనేదే అసలు సినిమా. నేల విడిచి సాము చేయని అక్కినేని కుర్రాడు: గత సినిమాల్లో కేవలం స్టైలిష్ లుక్స్, భారీ మాస్ ఎలివేషన్లను నమ్ముకున్న అఖిల్.. ఈసారి రూట్ మార్చాడు. కథను నమ్ముకుని, అందులో ఒక పాత్రలా ఒదిగిపోయాడు. పాత సినిమాల ఛాయలు ఎక్కడా కనిపించకుండా పల్లెటూరి కుర్రాడిగా అఖిల్ బెస్ట్ పెర్ఫామెన్స్ ఇచ్చాడు. ఇక వింటేజ్ నాగార్జున లుక్‌ని గుర్తుచేసేలా ఉన్న గెటప్, ముఖ్యంగా ఇంటర్వెల్ బ్యాంగ్, క్లైమాక్స్ యాక్షన్ సీన్లలో అఖిల్ చూపించిన ఇంటెన్సిటీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుంది. మహాభారతం ముడిపడిన ఆసక్తికర స్క్రీన్‌ప్లే: దర్శకుడు మురళి కిషోర్ ఈ కథను చిత్తూరు పల్లెటూళ్లలో జరిగే మహాభారత నాటకాల చుట్టూ అల్లాడు. మహాభారతంలో ఉండే స్నేహం, నమ్మకద్రోహం, కుట్రలు ఇందులోనూ కనిపిస్తాయి. ఇక సినిమా మొదట్లో లవ్ సీన్స్ కాస్త మామూలుగా అనిపించినా, ప్రీ-ఇంటర్వెల్ నుండి కథ స్పీడందుకుంటుంది. ఇంటర్వెల్ ట్విస్ట్ అదిరిపోతుంది. అయితే హీరో హీరోయిన్ల మధ్య లవ్ డెప్త్, విలన్ పగకు బలమైన కారణాలు లేకపోవడం వల్ల ఎమోషన్ అనుకున్నంత రేంజ్‌లో పండలేదు. తమన్ మ్యూజిక్ మ్యాజిక్.. నటీనటుల జోరు: సినిమాకు తమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, 'ఎట్టా ఎట్టా', 'వారెవా' పాటలు పెద్ద ప్లస్ పాయింట్లు. హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే తన అందం, అభినయంతో మెప్పించగా, కన్నడ నటుడు ప్రమోద్ కొన్ని సీన్లలో అఖిల్‌ను డామినేట్ చేసేలా నటించాడు. ఇక విలన్‌గా శివాజీ, తల్లి పాత్రలో ఈశ్వరీ రావు బాగా చేశారు. ప్రొడక్షన్ వాల్యూస్ చాలా గ్రాండ్‌గా ఉన్నాయి. ట్విస్టుల కోసం కథ రాసినట్లు అనిపించినా, ఎక్కడా బోర్ కొట్టించకుండా సినిమా అలా సాగిపోతుంది. 'లెనిన్' సినిమా అఖిల్ కెరీర్‌ను రాత్రికి రాత్రే మార్చేసే పెద్ద అద్భుతమేమీ కాదు గానీ.. ఆయన పాత సినిమాలతో పోలిస్తే మాత్రం చాలా బెటర్. కమర్షియల్ ఎలిమెంట్స్, అదిరిపోయే ట్విస్టులు, అఖిల్ సరికొత్త యాక్టింగ్ కోసం ఈ వీకెండ్‌లో ఎలాంటి అంచనాలు లేకుండా థియేటర్‌కు వెళ్తే ఒకసారి హ్యాపీగా వాచ్ చేయొచ్చు.



Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197